PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 12 | విజయవాడ, సోమవారం 12 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 12 August 2024 | Rs

లాస్ ఏంజెల్స్‌లో మళ్లీ కలుద్దాం..!

- ముగిసిన పారిస్ ఒలింపిక్స్
- అంగరంగ వైభవంగా వేడుకలు

పారిస్: రెండు వారాల పాటు ప్రపంచవ్యాపితంగా క్రీడాభిమానులను ఉర్రూతలూగించిన 33వ పారిస్ ఒలింపిక్ క్రీడలు ఆదివారంతో ముగిశాయి. పారిస్‌కు బై బై.., లాస్ ఏంజెల్స్‌కు వెల్‌కమ్ అంటూ క్రీడాకారులు సెలవు తీసుకున్నారు. ఫ్రెంచ్ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా సాగిన ముగింపు వేడుకలు ఔరా అనిపించాయి. రెండు వారాల క్రితం ప్రధాన స్టేడియం వెలుపల జరిగిన ప్రారంభోత్సవ వేడుకలు ఒక ఎత్తు అయితే, ముగింపు వేడుకలు మరో ఎత్తు. ముగింపు సంబరాల్లో కళ్లు మిరుమిట్లు గొలిపే లేజర్ కాంతులతో బాటు సంప్రదాయ బద్ధమైన నృత్యాలు, రకరకాల కళా రూపాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ముగింపు సందర్భంగా జరిగిన క్రీడాకారుల మార్చ్‌పాస్ట్‌లో భారత త్రివర్ణ పతాకాన్ని హాకీ గోల్ కీపర్ శ్రీజేష్, యువ షూటర్ మను భాకర్ చేబూని ముందు నడవగా, మిగతా క్రీడాకారులు వారిని అనుసరించార. పారిస్ ఒలింపిక్స్ ముగింపును పురస్కరించుకుని ఒలింపిక్ పతాకాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం(ఐఓసి) అధ్యక్షులు థామస్ బాచ్ తదుపరి ఒలింపిక్స్‌కు ఆతిధ్యమిచ్చే లాస్ ఏంజెల్స్ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాలివుడ్ నటుడు , నిర్మాత టామ్ క్రూజ్ తదితరులు పాల్గొన్నారు. చివరిలో అథ్లెట్ల పరేడ్ జరిగింది. జులై 26న సీన్ నదిలో ప్రారంభమైన విశ్వక్రీడలు ఆగస్టు 11 రాత్రి జరిగిన ముగింపు ఉత్సవాలతో పూర్తయ్యాయి. 14 రోజుల పాటు సాగిన ఈ విశ్వక్రీడల్లో 206 దేశాలనుంచి 10.714 క్రీడాకారులు పాల్గొన్నారు. 32 క్రీడాంశాలకు గాను 48 ఈవెంట్స్ జరగ్గా.. మొత్తం 329 స్వర్ణ పతకాలను అందజేశారు.

భారత్‌కు ఆరు పతకాలు
టాప్‌లో అమెరికా,
2వ స్థానంలో చైనా

8



సెబీ చీఫ్ తప్పుకోవాలి

- అదానీ అక్రమాలపై జెపిసితో విచారణ
- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఇంతకు ముందు అదానీ కంపెనీల షేర్ల ధరల కృత్రిమ పెంపు బాగోతాన్ని బయటపెట్టిన హిండెన్స్‌బర్గ్ రిసెర్చి సంస్థ ఇప్పుడు భారతీయ సెక్యూరిటీ అండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డు (ఎస్ఇబిఐ) ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై ఆధారాలతో సహా ఆరోపణలు చేసినందున, దీనిపై తగు దర్యాప్తు జరిగేంతవరకు సెబీ ఛైర్‌పర్సన్ పదవి నుంచి ఆమె తప్పుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మాధబి పురి, ఆమె భర్తకు అదానీ గ్రూపులోని షాడో కంపెనీల్లో వాటాలున్నాయని పరిశోధనా సంస్థ ఆధారాలతో సహా బయటపెట్టింది. తాజా నివేదిక ప్రకారం అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు, బిలియనీర్ వినోద్ అదానీతో సంబంధం ఉన్న బెర్ముడా, మారిషస్‌లోని షాడో కంపెనీలలో మాధబి పురి, ఆమె భర్త ధవల్ బచ్ ఉన్నారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్‌లో అవకతవకలకు సంబంధించిన మొత్తం వ్యవహారంపై దర్యాప్తునకు జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని పొలిట్‌బ్యూరో మరోసారి డిమాండ్ చేసింది.

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరం


షేక్ హసీనా ప్రభుత్వం పతనానంతరం బంగ్లాదేశ్‌లోని హిందూ ప్రార్ధనా స్థలాలపైన, మైనారిటీ కమ్యూనిటీపైన ఎడాపెడా దాడులు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలపై సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ పతనం తరువాత నెలకొన్న అరాచక పరిస్థితులను ఆసరా చేసుకుని మత ఛాందసవాద శక్తులు మైనారిటీలు లక్ష్యంగా హింసకు తెగబడుతున్నాయని పేర్కొంది. తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీల భద్రతకు, వారి ఇళ్లు, ప్రార్ధనా స్థలాల రక్షణకు తక్షణమే గట్టి చర్యలు తీసుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం దీనిని బంగ్లాదేశ్‌లోని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కూడా సిపిఎం కోరింది.

కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

- డ్యాములో సగం నీరు ఖాళీ అయ్యే అవకాశం
- బోర్డు నిర్లక్ష్య ఫలితం
- దిగువ ప్రాంతాలకు హెచ్చరికలు జారీ


ప్రజాశక్తి- యంత్రాంగం

కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లో ఉన్న ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు సాగు నీరు, తాగునీరు అందించే తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ శనివారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. గేట్ చైన్‌లింక్ తెగిపోవడంతో గేటు ఊడిపోయి వరద నీటిలో కొట్టుకుపోవడంతో నీరు వృథాగా పోతోంది. తుంగభద్ర బోర్డు అధికారుల అలసత్వంతోనే ఈ ఘటన మిగతా 2లో



కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా



తుంగభద్ర డ్యామ్‌లో నీటి వృథాను నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా పోతున్న నేపథ్యంలో ఆదివారం జలవనరుల శాఖ అధికారులు, మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్‌తో ఆయన సమీక్షించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నిర్వహణలోలేని పాత గేటు కొట్టుకుపోయిందని ముఖ్యమంత్రికి జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వివరించారు. డ్యాంలో ఆరు మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని తెలిపారు. స్టాప్‌లాక్ అరేంజ్‌మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తక్షణం ప్రాజెక్టు వద్దకు డిజైన్ టీమును పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సూచించారు. తాత్కాలిక గేటు ఏర్పాటుపై డ్యామ్ అధికారులతో మాట్లాడాలన్నారు. తాత్కాలిక స్టాప్‌లాక్ గేటు ఏర్పాటుకు ఇబ్బందులున్నాయని, పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రికి పయ్యావుల వివరించారు.

3నెలలుగా జీతాల్లేవ్

గురుకులాల్లో ఐదు నెలలుగా వెండర్ల బిల్లులు పెండింగ్

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలోని గురుకులాల్లో పరిస్థితి దినదిన గండంగా ఉంది. గురుకుల పాఠశాలలు, కళాశాల్లోని ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. కూరగాయలు, గ్యాస్, పప్పులు ఇతర సరుకులు పంపిణీ చేస్తున్న వెండర్లకు ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇక తాము సప్లై చేయలేమంటూ కొందరు వెండర్లు చేతులెత్తేస్తున్నారు. రాష్ట్రంలో 454 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 2.27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎస్‌సి (అంబేద్కర్) గురుకుల పాఠశాలలు 189, ఎస్‌టి గురుకుల పాఠశాలలు 80, బిసి (జ్యోతీరావుపూలే) గురుకుల పాఠశాలలు 124, జనరల్ (ఒసి) 61 ఉన్నాయి. ఒక్కో పాఠశాల, కళాశాలలో సుమారు 500 నుంచి 650 మంది విద్యార్థులు ఉన్నారు. 30 నుంచి 50 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 40 శాతం నిధులు సమకూర్చాలి. గురుకులాల్లో భోజనం, వసతులు కల్పిస్తున్నారు. శిక్షణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. పేద విద్యార్థులు ఇక్కడ బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్‌లో వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో గురు కులాలను మరింత బలోపేతం చేయాల్సి ఉంది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఉద్యోగులకు, సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదు. దీంతో, అప్పులు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. జీతాల బకాయిలు ఉన్నా గురుకుల విద్యార్థులు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో అప్పులు చేసి ఖర్చులు చేస్తున్నామని కొందరు ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు చెప్తున్నారు. అన్ని గురుకులాలకూ పప్పులు, గ్యాస్, కూరగాయలను వెండర్లు సరఫరా చేస్తున్నారు. వీరికి మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై మాసాల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. గ్యాస్ సరఫరా నిలిపేస్తామని కొందరు వెండర్లు చెప్పినట్లు సమాచారం. ఇటీవల కొందరు జిల్లా కలెక్టర్లు వెండర్లను పిలిచి మాట్లాడారు. సరుకుల సరఫరా ఆపొద్దని, బిల్లులు సర్దుబాటు చేస్తామని, పిల్లలు పస్తులుండకుండా చూడాలని సూచించినట్లు సమాచారం. విద్యార్థులకు ప్రతి నెల ఇచ్చే కాస్మోటిక్ ఛార్జీలను గత ప్రభుత్వం నిలిపేసింది. అమ్మఒడి అమలు చేస్తున్నందున వీటిని ఇవ్వడం మానేసింది. కొన్ని సంవత్సరాలుగా గురుకులాల మెయింటెన్స్‌కు ప్రభుత్వం ఒక్క రూపాయి మంజూరు చేయడం లేదు. ఏదైనా పాడైతే దాని రిపేరు ఖర్చును ఆయా గురుకులాల ప్రిన్సిపళ్లుభరించాల్సి వస్తోంది. గురుకులాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని, విద్యార్థులు రోడ్డున పడకుండా చూడాలని కోరుతున్నారు.



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బోగోలులోని గురుకుల (అంబేద్కర్) పాఠశాల



హారిస్‌కే ఆధిక్యం

- నాలుగు పాయింట్ల తేడాతో వెనకబడ్డ ట్రంప్



విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

- సబ్‌స్టేషన్ ముందు నిరసన

లోపలి పేజీలో..

రెవెన్యూ సదస్సుల్లో

దేవాదాయ భూములపై ఫిర్యాదుల స్వీకరణ

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 16 నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సుల్లో దేవాదాయశాఖ భూములపైనా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కృష్ణా, గోదావరి సంగమం వద్ద హారతుల కార్యక్రమాన్ని ప్రభుత్వం పున:ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఈ నెల 12న మంత్రులు పొంగూరు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్‌తో కూడిన బృందంతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామన్నారు. సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఆదివారం ఆయన మంత్రి హోదాలో తొలిసారిగా తన ఛాంబర్‌లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా సిజిఎఫ్ నిధులతో 160 ఆలయాల ఆధునీకరణ పనులు, తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని అగస్తేశ్వరస్వామి ఆలయాన్ని రూ.100 కోట్ల సిజిఎఫ్ నిధులతో ఆధునీకరించే పనులకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ముందుకువెళుతున్నామన్నారు. నెల్లూరు జిల్లాలో రెండు ఆలయాలకు సంబంధించి విచారణ జరిపి ప్రాథమిక నివేదిక అందిన వెంటనే ఐదుగురు అధికారులను సస్పెండ్ చేశామన్నారు. దేవాదాయశాఖలోని ఓ అధికారి, ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు ఎంపిలు, నేతల దురాగతాలపై మీడియాలో వచ్చిన కథనాలకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నట్లు తెలిపారు.

దేవాదాయశాఖ పరిధిలో 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాలకు గతంలో ధూప దీప నైవేద్యాలకు రూ.5 వేలు ఇచ్చేవారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతూ ప్రతిపాదనలను సిఎం చంద్రబాబు ఆమోదం కోసం పంపినట్లు మంత్రి తెలిపారు. దేవాదాయశాఖ ఆధీనంలో రాష్ట్ర వ్యాప్తంగా 4.65 లక్షల ఎకరాల భూములున్నాయని, ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణ, జాయింట్ కమిషనరు ఆజాద్, డిప్యూటీ కమిషనరు రతన్‌రాజు పాల్గొన్నారు.

నా ఉద్వాసన వెనుక

అమెరికా హస్తం

- సెయింట్ మార్టిన్ దీవిలో పాగాకు అనుమతించనందుకే
- త్వరలోనే దేశానికి : హసీనా
- అవామీ లీగ్ కార్యకర్తలకు లేఖ

న్యూఢిల్లీ : తన ప్రభుత్వ పతనానికి అమెరికా కుట్రే కారణమని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ఆరోపణలు చేశారు. అవామీలీగ్ పార్టీ కార్యకర్తలకు రాసిన లేఖలో ఆమె ఈ విషయం పేర్కొన్నట్లు 'ఎకనమిక్ టైమ్స్', 'ది ప్రింట్' వంటి పత్రికలు వెల్లడించాయి. శవాలపై అధికారంలోకి రావాలని వారు చూశారు. శవాల యాత్రను నివారించడం కోసమే తాను పదవి నుంచి తప్పుకున్నానని బంగ్లా మాజీ ప్రధాని సెలవిచ్చారు. బంగ్లా దేశ్ దక్షిణం వైపున ఉన్న మూడు చ. కి. మీ వైశాల్యంలో ఉన్న సెయింట్ మార్టిన్ దీవి నుంచి తాను తప్పుకుని, బంగాళాఖాతంలో పాగా వేసేందుకు అమెరికాను అనుమతించి వుంటే, తాను ఈ రోజు అధికారంలో కొనసాగివుండేదాణ్ణి, అడ్డుకున్నందుకే తన ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు అమెరికా వంటి విదేశీ శక్తులు కుట్ర పన్నాయని ఆమె ఆరోపించారు. కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన రాజకీయ వివాదంగా మారడంతో షేక్ హసీనా రాజీనామా చేసి, దేశాన్ని విడిచి భారతదేశం వచ్చిన సంగతి తెలిసిందే.

"నేను ఇంకా దేశంలో ఉండి ఉంటే, ఎక్కువ మంది ప్రాణాలు పోయేవి. మరిన్ని వనరులు, ప్రజా ఆస్తులు దెబ్బతినేవి. అందుకే వైదొలగాలనే కఠిన నిర్ణయాన్ని తీసుకున్నాను. మీరే నా బలం. మీరు నన్ను కోరుకోలేదు కాబట్టి వెళ్లిపోయాను' అని పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులను తాను ఎప్పుడూ రజాకార్లు అని పిలవలేదని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులను రెచ్చగొట్టడానికి తన వ్యాఖ్యలను వక్రీకరించారని, పూర్తి వీడియోను చూడాలని ఆమె అభ్యర్థించారు.

'అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు హత్యకు గురయ్యారని, కార్యకర్తలు వేధింపులకు గురవుతున్నారని, వారి ఇళ్లను తగులబెట్టారని వార్తలు వస్తున్నాయి. అవి చూసి నా గుండె రోదిస్తున్నది. అల్లా దయతో నేను త్వరలో తిరిగి వస్తాను. సవాళ్లతో పోరాడిన తర్వాత అవామీ లీగ్ మళ్లీ నిలబడేలా చేస్తాను. బంగ్లాదేశ్ భవిష్యత్తు కోసం అల్లాను ప్రార్థిస్తున్నాను. నా గొప్ప తండ్రి కలలు కన్న, దాని కోసం కృషి చేసిన దేశం. నా తండ్రి, కుటుంబం తమ ప్రాణాలను అర్పించిన దేశం." అని మాజీ ప్రధాని షేక్ హసీనా లేఖలో తెలిపారు.

సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

3





విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి

6 నెలల ముందే 'భోగాపురం'

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

నిర్ణీత సమయానికి ఆరు నెలల ముందే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మిగతా 2లో

నట్వర్ సింగ్ ఇక లేరు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి కె.నట్వర్ సింగ్ (93) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజస్థాన్‌లో 1931లో జన్మించిన ఆయన 22 ఏళ్ల వయసులోనే ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఇంగ్లండ్, జాంబియా, పాకిస్తాన్ వంటి దేశాల్లో రాయబారిగా పనిచేశారు. 1984లో భరత్‌పూర్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. రాజీవ్‌గాంధీ హయాంలో ఉక్కు, బొగ్గు, గనుల, వ్యవసాయ శాఖ సహాయ మంత్రిగానూ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో విదేశాంగశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 'ఆయిల్ ఫర్ ఫుడ్' పథకంలో ఆరోపణలతో మంత్రి పదవికి రాజీనామా చేశారు. దౌత్య సంబంధాల్లో సేవలకు గాను 1983లో పద్మ విభూషణ్, 1984లో పద్మ భూషణ్ అవార్డులు అందుకున్నారు.

కొలిక్కి రానున్న పంచ గ్రామాల భూ సమస్య

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దశాబ్దాలుగా పరిష్కారం కాని పంచ గ్రామాల సమస్య కూటమి ప్రభుత్వంలో కొలిక్కి తెచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తాత్కాలిక పరిహారం ఇచ్చి ఎల్‌జి పాలిమర్స్ చేతులు దులుపుకుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ప్రభావిత గ్రామాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌తోపాటు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అప్పటి సిఎం జగన్, ఇతర మంత్రులు చెప్పారని, నేటికీ ఆస్పత్రి నిర్మాణం జరగలేదని పలువురు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

- ఎఐ ఆధారిత డేటా సెంటర్‌పై చర్చలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణను హైదరాబాద్‌లో చేపట్టాలని ఆ సంస్థ నిర్ణయించింది. దానిలో భాగంగా ఎఐ ఆదారిత డేటా సెంటర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ ప్రతినిధుల బృందం ఆసక్తి కనబరిచింది. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ బృందం భేటీ అయ్యింది. తమ సంస్థ విస్తరణకు సంబంధించిన పలు అంశాలను మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించారు. ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ఆ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్‌లోనే ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటెడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్'ను ప్రారంభించింది. వెబ్ సర్వీసెస్‌కు సంబంధించిన మూడు డేటా సెంటర్లు ఇప్పటికే హైదరాబాద్‌లో పని చేస్తున్నాయి. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను నెలకొల్పుతూ తమ వ్యాపారాన్ని విస్తరించాలని యోచిస్తున్నట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయనీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున తగిన సహకారం, ప్రోత్సాహకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో తమ సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో క్లౌడ్ సేవలను విస్తరిస్తామనీ, తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని చెప్పారు.

6 నెలల ముందే 'భోగాపురం'


(మొదటి పేజీ తరువాయి)

టెర్మినల్ భవనం, రన్‌వే, ఎటిసి టవర్, ఇతర భవనాలను పరిశీలించి జిల్లా అధికారులు, జిఎంఆర్, ఎల్ అండ్ టి ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 2026 డిసెంబర్ నాటికి ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రస్తుత పనుల తీరును బట్టి ఆరు నెలల ముందుగా 2026 జూన్ నాటికే విమానాశ్రయం సిద్ధమవుతుందని చెప్పారు. ప్రతి నెలా విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానన్నారు. దేశంలో విమానయాన రంగం ఏటా 16 శాతం వృద్ధితో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కోసం డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. భారత విమానయాన రంగం ప్రపంచంలో ఉన్నతమైనదిగా అడుగులు వేస్తోందన్నారు. ముంబయి సమీపంలోని నవీ ముంబయి ఎయిర్‌పోర్ట్, నోయిడా సమీపంలోని జీవన్ ఎయిర్‌పోర్ట్‌లను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చాలాచోట్ల విమానాశ్రయాలను నిర్మించాల్సి ఉందని, అవసరమైన భూమి, సాంకేతిక అంశాలు అనుకూలిస్తే వీటిని చేపడతామని చెప్పారు. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా మూలపేట ధగదర్తి, నాగార్జునసాగర్, కుప్పం వద్ద విమానాశ్రయాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. అనంతపురం, ఒంగోలు, తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, అదిలాబాద్, రామగుండం వద్ద కూడా విమానాశ్రయాల కోసం ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని చెప్పారు. కనీసం 1,000 నుంచి 1500 ఎకరాల భూమి ఉంటే తప్ప, ఎయిర్‌పోర్టును ప్రతిపాదించలేమని తెలిపారు.

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో

దక్షిణాదిన కర్ణాటక టాప్

- రెండో స్థానంలో తమిళనాడు
- మూడో స్థానంలో రాష్ట్రం
- దేశంలో అగ్రస్థానంలో రాజస్థాన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ - జూన్) దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. తమిళనాడు రెండో స్థానాన్ని, ఆంధ్రప్రదేశ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. కేంద్ర విద్యుత్ అధీకృత సంస్థ (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ - సిఇఎ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం..కర్ణాటక 9,171.16 మిలియన్ యూనిట్లు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసి దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది ఇదేకాలంలో 10,001.55 ఎంయు ఉత్పత్తి చేయగా ఈ దఫా కాస్త తగ్గుదల కనిపించింది. ఇక తమిళనాడు 8379.19 ఎంయు ఉత్పత్తితో రెండో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదేకాలానికి 8400.15 ఎంయు ఉత్పత్తి చేయగా ఈ దఫా స్వల్ప తగ్గుదల కనిపించింది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 4,700.34 ఎంయు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదే కాలంలో 4,882.53 ఎంయు ఉత్పత్తి చేయగా ఈ దఫా దానికంటే కాస్త తగ్గింది. ఇక కేరళ గతేడాదితో పోలిస్తే కాస్త పుంజుకొని ఈ ఏడాది 2,377.74 ఎంయు ఉత్పత్తి చేయగలిగింది. గతేడాది ఇదేకాలంలో 2,150.90 ఎంయు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసింది. తెలంగాణ ఈ ఏడాది 2,035.15 ఎంయు ఉత్పత్తి చేయగా, గతేడాది ఇదే కాలంలో 2,200.23 ఎంయు ఉత్పత్తి నమోదు చేసింది. ఇక దక్షిణాదిన ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ఈ ఏడాది 3.06 ఎంయు ఉత్పత్తి నమోదు చేయగా, గతేడాది కూడా ఇదే మొత్తంలో ఉత్పత్తి నమోదు చేసింది. అయితే గాలి మరల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడంలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవడం విశేషం. నివేదిక ప్రకారం..తమిళనాడు 4,114.02 ఎంయు ఉత్పత్తి చేయగా..కర్ణాటక గాలి మరల ద్వారా 3,095.93 ఎంయు ఉత్పత్తి సాధించింది. కాగా జల సిరులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో కర్ణాటక, కేరళ రాష్ట్రాలు 25 మెగా వాట్ల లోపు చిన్న తరహా జల విద్యుత్ ఉత్పత్తి పథకాలపైనా, భారీ జల విద్యుత్ ప్రాజెక్టులపైనా దృష్టి సారించినట్లు నివేదికలో పేర్కొన్నారు. దాదాపు 4500 మినీ హైడ్రో ప్లాంట్లు నెలకొల్పిన కర్ణాటక ఈ విభాగంలో ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన స్థానంలో ఉంది. జల వనరుల కోసం పొరుగు రాష్ట్రాలపై ఆధారపడుతున్నందున హైడ్రో ప్రాజెక్టులపై ఆధారపడటమనేది తమిళనాడుకు పెను సవాలు అని తమిళనాడు విద్యుత్ ఉత్పత్తి సంస్థ (తంగెడ్కో) అధికారి ఒకరు తెలిపారు. అందువల్లే ఈరోడ్, కదంపరై, కుందా, తిరునెల్వేలి నాలుగు ఉత్పాదక సర్కిళ్లలో కేవలం 2321.90 మెగా వాట్ల స్థాపక సామర్థ్యంతో 47 హైడ్రో పవర్ స్టేషన్లను మాత్రమే తంగెడ్కో హైడ్రో విభాగం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పేందుకు ప్రణాళికలు రచిచిస్తున్నట్లు సదరు అధికారి వివరించారు.

అగ్రస్థానంలో రాజస్థాన్, గుజరాత్

జాతీయ స్థాయిలో చూస్తే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో రాజస్థాన్, గుజరాత్ మొదటి, రెండో స్థానంలో నిలిచాయి. రాజస్థాన్ ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి 15,101.57 ఎంయు విద్యుత్ ఉత్పత్తి నమోదు చేయగా, గుజరాత్ 13,480.23 ఎంయు ఉత్పత్తి సాధించింది.

అంకిత భావంతో ఇంధన సామర్థ్యం పెంపు

ఇందన సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అంకిత భావాన్ని ప్రదర్శిస్తోందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో, ఇంధన సామర్థ్యంలో అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. బిఇఇ దక్షిణాది రాష్ట్రాలు, యుటి మీడియా సలహాదారు ఎ చంద్రశేఖర్‌రెడ్డి, (ఎపిఎస్‌ఇసిఎం) సిఇఒ బిఎవి కుమార్‌రెడ్డితో కలిసి ఇంధన సామర్థ్యానికి సంబంధించిన సమగ్ర నివేదికను ఆదివారం విజయానంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్తు పొదుపు సామర్థ్య ప్రయత్నాలు రాష్ట్రానికి, విద్యుత్తు రంగానికి మాత్రమే కాకుండా, విద్యుత్తు వినియోగదారులకు, ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణలో కీలకమన్నారు. ఎపి, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బిఇఇ ప్రకటించింది. పెరుగుతున్న దేశీయ ఇంధన డిమాండ్ల మధ్య స్థిరమైన ఇంధన పద్ధతుల ప్రాముఖ్యత గురించి వివరించింది.

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్


రక్తతర్పణం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

విలక్షణ ప్రచురణకర్త పెరుమాళ్లు

- శతజయంతి సభలో వక్తలు
- 'రక్తతర్పణం' ఆవిష్కరణ

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్ (ఎన్‌టిఆర్ జిల్లా)

ప్రజాశక్తి, విశాలాంధ్ర తర్వాత ఆ స్థాయిలో ఉత్తమ రచనలను, ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అతి తక్కువ ధరలో అందించిన విలక్షణ ప్రచరణకర్త పెరుమాళ్లు అని పలువురు వక్తలు కొనియాడారు.

జయంతి పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు ముప్వల పెరుమాళ్లు శతజయంతి సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీలో ఆదివారం జరిగింది. ఈ సభలో సాహితీవేత్త పన్నాల సుబ్రమణ్యభట్టు మాట్లాడుతూ సాహిత్య రంగానికి పెరుమాళ్లు చిరస్మరణీమైన కృషి చేశారని వివరించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంపై పెరుమాళ్ల తనయుడు, రచయిత ముప్వల సుబ్బరామయ్య రాసిన రక్తతర్పణం పుస్తకాన్ని ఆవిష్కరించిన పల్లవి పబ్లికేషన్స్ అధినేత వెంకటనారాయణ మాట్లాడుతూ ఏ రచనైనా మంచికి హాని, చెడుకు సహాయమూ చేయకూడదని రావిశాస్త్రి చెప్పిన దానిని కడవరకూ ఆచరించి మంచి పుస్తకాలు మాత్రమే ప్రచురించిన ప్రచురణకర్తగా ముప్వల పెరుమాళ్లు కలకాలం గుర్తుండిపోతారని కొనియాడారు. అశోక్ బుక్ సెంటర్ అధినేత అశోక్ కుమార్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన అరుదైన వ్యక్తి పెరుమాళ్లు అని అన్నారు. విరసం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ విజయవాడ ప్రచురణరంగం చరిత్రలో పెరుమాళ్లు అధ్యాయం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఏలూరు రోడ్డులోని జయంతి పబ్లికేషన్స్ బుక్ షాప్‌ను మార్కెట్ ధర కన్నా తక్కువకే ప్రజాశక్తి ప్రచురణ సంస్థకు పెరుమాళ్లు ఇచ్చిన నేపథ్యాన్ని శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి లక్ష్మయ్య వివరిస్తూ నివాళులర్పించారు. విలువలకు కట్టుబడిన మనిషి పెరుమాళ్ళు అని విశాలాంధ్ర మేనేజర్ మనోహర్ నాయుడు అన్నారు. ప్రచురణరంగానికి పెరుమాళ్లు చేసిన సేవలను కొనియాడుతూ డాక్టర్ సశ్రీ, గోళ్ల నారాయణరావు, ముప్వల సుబ్బరామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జయంతి పెరుమాళ్లు కుటుంబ సభ్యులు, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- పోస్టరు ఆవిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోడ్డు ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో రోడ్డు సేఫ్టీ సంస్థ రూపొందించిన రోడ్డు భద్రతా పోస్టర్లను రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు అనేవి అత్యంత విషాదమైన సంఘటనలని, వీటిని నివారించేందుకు ప్రజల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం వుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌కె దుర్గ పద్మజ, సభ్యులు వెంకటేశ్వరరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి- విజయవాడ

ప్రకాశం బ్యారేజీకి ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఒకే స్థాయిలో నడుస్తోంది. ఎగువ కృష్ణా నుంచి ప్రకాశం బ్యారేజీకి 2,61,401 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. 50 గేట్లు ఆరు అడుగులు, 20 గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి 2,46,950 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 14,451 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువలకు పంపిస్తున్నట్లు బ్యారేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి కృష్ణారావు తెలిపారు.

కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకున్నట్లు విమర్శలు వెల్లువెల్తుతున్నాయి. గేట్ కొట్టుకుపోయిన ప్రాంతంలో ఎక్కువ ఒత్తిడి పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొత్తం 33 గేట్లలో ఒక గేటు కొట్టుకుపోవడంతో మిగిలిన 32 గేట్లనూ ఎత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఏటా డ్యాం గేట్ల వార్షిక తనిఖీ నిర్వహిస్తారు. ఈ ఏడాది మేలో ఇంజనీర్లు ఈ తనిఖీ చేశారు. గేట్ల నిర్వహణ సక్రమంగా లేదని, ప్రత్యామ్నాయంగా గేట్లు ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. వాటిని తుంగభద్ర బోర్డు అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. డ్యాం గేట్ కొట్టుకుపోయిన ప్రాంతాన్ని విశ్రాంత ఇంజనీర్ కన్నయ్య నాయుడు పరిశీలించారు. తుంగభద్ర డ్యాం గేట్ల నిర్మాణ పనులు జరిగేటప్పుడు ఆయన ఇంజనీర్‌గా ఉన్నారు. గేటు మరమ్మతులు పూర్తి కావడానికి ఐదు నుండి ఆరు రోజులు సమయం పడుతుందని ఆయన తెలిపారు. డ్యాం నిర్మించిన 71 సంవత్సరాల్లో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదన్నారు. తుంగభద్ర రిజర్వాయర్ నుండి నదిలోకి నీరు వథాగా పోకుండా తుంగభద్ర బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. గేట్ల వద్ద చైన్లకు మరమ్మతు పనులు మొదలెట్టారు. రబ్బరు గేట్ల ఏర్పాటు ద్వారా నీటిని నిలువరించేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నారు. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 104.182 టిఎంసిలు ఉన్నాయి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 24,500 క్యూసెక్కులు మాత్రమే ఉంది. భవిష్యత్తులో మంచి వర్షాలు కురిస్తే తప్ప మళ్లీ డ్యాం నిండే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. దిగువ ప్రాంతాలైన కర్నూలు జిల్లా కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా హెచ్చరికలు జారీ చేశారు.

కర్ణాటక డిప్యూటీ సిఎం పరిశీలన

తుంగభద్ర డ్యామ్‌ను కర్ణాటక డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ ఆదివారం పరిశీలించారు. గేటు ధ్వంసం అవడానికి కారణాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడం బాధకరమన్నారు. 17వ గేటు నుంచి 32వ గేట్ల నిర్వహణ బాధ్యత కర్ణాటక ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. నిపుణుల బృందం జలాశయాన్ని పరిశీలిస్తోందని చెప్పారు. కేంద్ర జల సంఘం కూడా నిపుణులను పంపిందని తెలిపారు. తుంగభద్ర డ్యామ్‌లో 40 నుంచి 50 టిఎంసిలు నిల్వ ఉంచి మిగతా నీటిని నదికి విడుదల చేస్తే గేటు మరమ్మతులకు ఆస్కారం ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరణ చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు మాత్రమే నీళ్లు అందేలా చూస్తామని, రబీ పంటకు నీరు అందించడం కొంచెం కష్టమేనని అన్నారు. రైతులు సహకరించాలని కోరారు. అంతకు ముందు డ్యాంను కర్ణాటక మంత్రి శివరాజ్ పరిశీలించారు.

తుంగభద్ర నీటి పరిరక్షణకు చర్యలు : మంత్రి పయ్యావుల కేశవ్

తుంగభద్ర రిజర్వాయర్లోని నీటి పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలనూ బోర్డు అధికారులు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను తుంగభద్ర బోర్డు అధికారులతో చర్చించినట్లు, నష్టం జరిగిన ప్రాంతంలో తాత్కాలిక గేట్ల ఏర్పాటుకు రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి అవసరమైన డిజైన్లను పొందినట్లు తెలిపారు. తాత్కాలిక గేట్ల ఏర్పాటుకు ఇద్దరు కాంట్రాక్టర్లను ఖరారు చేసినట్లు చెప్పారు. వెంటనే గేట్ల ఏర్పాటు పనులు మొదలవుతాయని, అధికారులు కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారని తెలిపారు. గేట్ కొట్టుకుపోయిన ప్రాంతాన్ని అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించాం : మంత్రి నిమ్మల

తుంగభద్ర డ్యామ్ గేటు ఊడిపోయిన ఘటనతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టరును జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో గతంలో ఇటువంటి సంఘటనలు

మన రాష్ట్రంలో గతంలో డ్యాం గేట్లు కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. 2021లో ఆగస్టులో పల్నాడు జిల్లా పులిచింత ప్రాజెక్ట్ క్రస్ట్ గేటు నీటిని విడుదల చేస్తున్న సమయంలో కొట్టుకుపోయింది. 2023 ఆగస్టులో ఈ గేటును పునర్నిర్మించారు. గత ఏడాది ప్రకాశం జిల్లాలోగల గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేటు కూడా కొట్టుకుపోయింది. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా వెంటనే స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు చేయడంతో నీటి వృథాను అరికట్టారు. తుంగభద్ర ప్రాజెక్టుకు స్టాప్‌లాగ్ గేట్ అమర్చే అవకాశం లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది.

ఉపాధి హామీ పనులు పెంచాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ పనులు పెంచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ గ్రామ సభలు జరపడంతో పాటు ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని కోరారు. జాబ్ కార్డులు పొందిన ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పించాలని, కాంట్రాక్టర్లకు పనులు కేటాయించొద్దని కోరారు. మరిన్ని ఉపాధి పనులు విస్తృతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జాబ్ కార్డులు పొందిన ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. గ్రామాల్లో ఏ విధమైన పనులు చేపట్టాలో ప్రజలతో చర్చించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ముందు ఉపాధి హామీ ద్వారా మట్టిపనులతో అభివృద్ధి చేయడానికి కావాల్సిన పనులు ఎంపిక కోసం ఈ సభలు చట్టం వచ్చినప్పటి నుంచి జరుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులు చేయగలిగిన 29 రకాల పనులు, కాల్వల తవ్వకం, మట్టి తీయడం, జంగిల్ క్లియరెన్స్ వంటి వాటిని ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని వివరించారు. ఉపాధి హామీ ద్వారా భూమి అభివృద్ధి పనులు అనేకం ఉన్నాయని తెలిపారు. వీటిని విస్తృతంగా చేపట్టి గ్రామాభివృద్ధి, మట్టిరోడ్లు వేయడం ద్వారా వ్యవసాయ కార్మికులకు మరిన్ని ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కుట్రలను తిప్పికొట్టి 'ఉక్కు'ను రక్షించుకుంటాం

- స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తోన్న కుట్రలను తిప్పికొట్టి కర్మాగారాన్ని రక్షించుకుంటామని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బి.మల్లయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1277వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత, బహుజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సమాజంలో గౌరవప్రదంగా కొనసాగాలంటే ప్రభుత్వ రంగ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు కావాల్సిందేనన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్పొరేట్లకు ఆ పరిశ్రమలను కారుచౌకగా అమ్మేస్తోందని తెలిపారు. పబ్లిక్ సెక్టార్ ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాటం తప్పక విజయం సాధిస్తుందని తెలిపారు.


వికసిత్ భారత్ బూటకమే

- ఆర్థిక విశ్లేషకులు డి పాపారావు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)


మాట్లాడుతున్న పాపారావు

ప్రధాని మోడీ ప్రచారం చేస్తోన్న వికసిత్ భారత్ ఒట్టి బూటకమేనని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్ మోడీ విధానాలతో సాధ్యమేనా' అంశంపై అమరావతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం రాత్రి చర్చాగోష్టి జరిగింది. ఈ కార్యక్రమానికి బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ కార్పొరేట్లకు దేశంలోని 80 శాతం సంపదను దోచిపెడుతూ 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్ చేస్తామనడం బిజెపి కపట నాటకాన్ని బయట పెడుతోందని తెలిపారు. పదేళ్ల మోడీ పాలనలో దేశంలో నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిందని, యువత ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్తోందని చెప్పారు. జిఎస్‌టి వల్ల చిన్న పరిశ్రమలు మూతబడటంతోపాటు చిరు వ్యాపారాలు తమ ఆదాయాన్ని కోల్పోయారని తెలిపారు. ప్రజలకు ఆదాయాలు వచ్చే మార్గం లేక పాత అప్పులు తీర్చకుండానే కొత్త అప్పుల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమానికి కోత పెడుతున్నారని, మోడీ చెప్పే వికసిత్ భారత్ సాధ్యం కాదని ఆయన విశ్లేషించారు. తొలుత వేదికపైకి వక్తలను స్టడీ సర్కిల్ బాధ్యులు ఎస్.వెంకట్రావు ఆహ్వానించారు.



నిస్వార్థ సామాజిక సేవా మూర్తి డొక్కా సీతమ్మ

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ

ప్రజాశక్తి-కల్చరల్ (హైదరాబాద్)

తెలుగు రాష్ట్రం కరువుతో విలయతాండవం చేస్తున్న సమయంలో గోదావరి జిల్లాల్లో రోజూ వందల మంది అన్నార్థులకు ఆహారం అందించిన డొక్కా సీతమ్మ నిస్వార్థ సామాజిక సేవా మూర్తి అని సిబిఐ న్యాయ స్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ కొనియాడారు. హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా డొక్కా సీతమ్మ యాదిలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతీ శర్మ పాల్గొని మాట్లాడుతూ.. అధికారం, పదవీ లేనప్పటికీ సేవా గుణం ఉంటే పది మందికి సహాయ పడవచ్చని సీతమ్మ నిరూపించారన్నారు. ఉన్న ఆస్తి అంతా దాన ధర్మాలకు వెచ్చించ్చి చివరి దశలో పేదరికం అనుభవించినా ఏనాడూ సీతమ్మ బాధపడలేదని అయన వివరించారు. జర్నలిస్ట్ జయ సూర్య కీలక ప్రసంగంలో డొక్కా సీతమ్మ జీవిత కథను ఆసక్తికరంగా తెలిపారు. గాన అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై అభినందన భవాని సామాజిక కార్యకర్త వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా, గాంధీలో మందుల కొరత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం ఇక్కడికి వస్తున్న వారికి చుక్కెదురవుతోంది. చికిత్సలో భాగమైన మందులు పూర్తి స్థాయిలో దొరకడం లేదు. డాక్టర్లు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్‌తో హాస్పిటల్ ఫార్మసీకి వెళ్తే మందులు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదేంటని అడిగితే సరఫరా లేదనీ, బయట కొనుక్కోవాలని ఉచిత సలహా ఇస్తున్నారని రోగులు చెబుతున్నారు. దాంతో చికిత్స కోసం వచ్చే పేద రోగులకు మందుల కొనుగోలు పెను భారంగా మారుతోంది. ట్రీట్‌మెంట్ వరకు ఉచితంగానే అందుతున్నా, మందులు మాత్రం పూర్తి స్థాయిలో దొరకడం లేదని బాధితులు వాపోతున్నారు. డాక్టర్లు ఐదారు రకాల మందులు రాస్తే, అందులో కేవలం ఒకటి లేదా రెండు రకాలకు మించి దొరకడం లేదని రోగుల సహాయకులు చెబుతున్నారు. దాంతో ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఉండే ప్రయివేటు మెడికల్ షాప్స్‌ను ఆశ్రయిస్తున్న రోగులు, మందుల కోసం ప్రతి రోగి కనీసం రూ.200 నుంచి రూ.300 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రధాన ఆసుపత్రులైన ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌కు గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు మేజర్ చికిత్సల నిమిత్తం తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. సాధారణ రోజుల కంటే ప్రస్తుత సీజన్‌లో ఒపి రోగులతో ఈ రెండు హాస్పిటల్స్ కిటకిటలాడుతూ ఉంటాయి. వీరందరికీ ఉచితంగా చికిత్స అందిస్తున్నప్పటికీ మందులు మాత్రం ఇవ్వలేని పరిస్థితి ఉంది. గంటల కొద్దీ క్యూ లైన్‌లో నిలబడ్డ రోగులు చివరికి కొన్ని రకాల మందులు లేవని తెలియడంతో ఉసూరుమంటున్నారు. డాక్టర్లు 10 రోజులకు మందులు రాసిస్తే 6 రోజులకు, ఐదు రోజులకు రాసిస్తే రెండు రోజులకే మందులు ఇస్తున్నారని రోగులు చెబుతున్నారు. చివరికి చేసేదేమీ లేక డాక్టర్లు రాసిచ్చిన మందుల్లో సగానికి పైగా సమీపంలోని ప్రయివేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా రోజులుగా ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రోగుల సహాయకులు అంటున్నారు.


చికిత్స పొందుతున్న మాధురి

దివ్వెల మాధురి ఆత్మహత్యాయత్నం

- ఆగి ఉన్న కారును ఢీకొట్టి కారు బోల్తా

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)
వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్నేహితురాలు దివ్వెల మాధురి ప్రయాణిస్తున్న కారు ఆదివారం ప్రమాదానికి గురైంది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ సమీపాన అతి వేగంతో వచ్చిన ఆమె కారు ఆగి ఉన్న కారును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో మాధురితోపాటు ఆమె వాహనం ఢీకొన్న కారులో ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన న్యాయవాది అవక్షిత్ నాయక్, ఆయన భార్య బేబీ నాయక్, డ్రైవర్ సుధాకర్‌కు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన మాధురిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించగా, తొలుత ఆమె చికిత్స తీసుకునేందుకు నిరాకరించారు. అనంతరం చికిత్స తీసుకునేందుకు సహకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి చేస్తున్న ఆరోపణలు, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తెలిపారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, తానే స్వయంగా కారును నడుపుతూ మరో వాహనాన్ని ఢీకొట్టానని చెప్పారు. తనపై, తన పిల్లలపై విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోందన్నారు. తనకు బతకాలని లేదని, అందుకే చనిపోవాలనుకున్నట్లు తెలిపారు. మాధురికి ప్రాణాపాయం లేకపోయినా తలకు గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వివాదంలో దివ్వెల మాధురి పేరు వినిపిస్తున్న విషయం విదితమే. తన భర్త మాధురితోనే ఉంటూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన భార్య, టెక్కలి జెడ్‌పిటిసి సభ్యురాలు వాణి దువ్వాడ నివాసం వద్ద ఆదివారం కూడా నిరసన కొనసాగించారు.

పాలస్తీనాలో శాంతిని పునరుద్ధరించాలి



సదస్సులో మాట్లాడుతున్న సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పాలస్తీనాలో శాంతిని పునరుద్ధరించాలని, ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలని సదస్సులో పలువురు వక్తలు కోరారు. ఇజ్రాయిల్ పాశవికంగా చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యాన పాలస్తీనాకు సంఘీభావంగా రాష్ట్ర సదస్సు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ్‌కుమార్, హరిచంద్‌సింగ్ బట్ మాట్లాడారు. గాజాను యుద్ధ భూమిగా ఇజ్రాయిల్ మార్చేసిందన్నారు. జనావాసాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సహాయక చర్యలకు వచ్చిన స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులపై బాంబుల వర్షం కురిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. గాజాలో ఉన్న పాలస్తీనియన్లు ఆహారం, నీరు లేక దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. పాశవికంగా ఇంత తీవ్రమైన దాడులు జరుగుతున్నా ఆపేందుకు అమెరికా ముందుకు రావడం లేదన్నారు. యుద్ధ ఆయుధాలు కొనుగోలు చేసుకునేందుకు ఇజ్రాయిల్‌కు 64 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు అమెరికా సిద్ధమైందన్నారు. యుద్ధం నిలిపేసి శాంతి నెలకొల్పాలని ఐక్యరాజ్యసమితిలో చేసిన అనేక తీర్మానాలను అమెరికా వ్యతిరేకించిందన్నారు. 12 వేల మంది పాలస్తీనా ప్రజలను జైల్లో ఉంచి ఇజ్రాయిల్ చిత్రహింసలకు గురిచేస్తోందన్నారు. పాలస్తీనాలో జరుగుతున్న ప్రజా పోరాటాలు, ఉద్యమాలను ఎలా అణచివేయాలో నేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీస్ అధికారులను అక్కడికి పంపుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయిల్ దుర్మార్గానికి వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రజలు నిలబడ్డారని చెప్పారు. అమెరికాలో యూనివర్సిటీ విద్యార్థులు సైతం యుద్ధానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని, దేశంలో మాత్రం జరగడం లేదని అన్నారు.

సదస్సులో వక్తలు

సంఘం సలహాదారు యాదవరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఒక పక్క ఆకలి చావులు జరుగుతుంటే, మరోపక్క రక్షణ రంగం కోసం అన్ని దేశాలూ బడ్జెట్‌ను పెంచుకుంటున్నాయని తెలిపారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి బుడ్డిగ జమీందారు మాట్లాడుతూ.. జాతిని నిర్మూలించాలనే ఆలోచనతో ఇజ్రాయిల్ ఎక్కువగా పిల్లలపై దాడులు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం కన్వీనరు మహంకాళి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు సుధాకర్, తెలంగాణ నాయకులు కెవిఎల్ తిప్పర్తి యాదవ్, సయ్యద్ రఫీ పాల్గొని మాట్లాడారు. కన్వీనరు సతీష్‌కుమార్ ఈ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. సదస్సు అనంతరం 24 మందితో నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా మహంకాళి సుబ్బారావు, సతీష్‌కుమార్, నాగిరెడ్డి, రఫీ ఎన్నికయ్యారు.

రైతుల బాధలు పట్టవా..?

- పంటల బీమా, పెట్టుబడి సాయం చెల్లించి రైతులను ఆదుకోండి
- మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రైతుల పట్ల చంద్రబాబు సర్కారు నిర్లక్ష్య వైఖరిని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్స్ (ట్విటర్) వేదికగా తప్పుబట్టారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు పంటల బీమా, పెట్టుబడి సాయాన్ని అందించకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఆదివారం ఎక్స్ ద్వారా జగన్ ట్వీట్ చేశారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను ఇప్పటి వరకు చెల్లించలేదని, దీనివల్ల రైతులకు ఉచిత పంటల బీమా చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను తమ హయాంలో ప్రతియేటా ఏప్రిల్-మే నెలల్లో చెల్లించి నష్టపోయిన రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. ఖరీఫ్ పంట వేసే సమయానికి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని



ప్రభుత్వమే చెల్లించి సమర్థవంతంగా అమలు చేశామన్నారు. ఇదే మాదిరి తమ ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.7,802 కోట్లు అందించి వారికి అండగా నిలిచామన్నారు. ఈ ఏడాది కోస్తాలో అతివృష్టి, రాయలసీమలో కరువు వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా మేలుకుని వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు పంటల బీమా కింద చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
రైతుకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా సొమ్ము ఏటా రూ.20 వేలు ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పారని, పెట్టుబడి సాయం కోసం వారంతా ఎదురుచూస్తున్నారని జగన్ పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తికావొస్తున్నా ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి ప్రకటనా లేదన్నారు.

హోం మంత్రి అనితకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)
రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు తృటిలో ప్రమాదం తప్పింది. సైక్లిస్టును తప్పించే క్రమంలో ఎస్కార్టు కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆ వాహనాన్ని మంత్రి వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటన ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయరహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నిట్ కాలేజీలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హోం మంత్రి విజయవాడ నుంచి బయల్దేరారు. మంత్రి కాన్వాయ్ కైకరం సమీపంలోకి వచ్చేసరికి అటుగా వెళ్తున్న సైక్లిస్టు అదుపుతప్పి కాన్వాయ్ ప్రయాణిస్తున్న కుడివైపు పడిపోయాడు. దీన్ని గమనించిన పోలీసు ఎస్కార్టు వెహికల్ డ్రైవర్ సైక్లిస్టును తప్పించేందుకు అకస్మాత్తుగా బ్రేకు వేశాడు. దీని వెనుకాలే వస్తున్న మంత్రి ప్రయాణిస్తున్న వాహనం పోలీసు ఎస్కార్టు వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మంత్రి కారు, ఎస్కార్ట్ వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో మంత్రి అనితకు ఎలాంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు. అనంతరం ఆమె మరో కారులో తాడేపల్లిగూడెం వెళ్లారని వివరించారు.


ఆవులదట్ల సబ్‌స్టేషన్ ముందు రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

- సబ్‌స్టేషన్ ముందు నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్ (అనంతపురం జిల్లా)
బోరుబావుల కింద పంటలు సాగు చేసిన రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారు. అప్రకటిత విద్యుత్ కోతలతో పది రోజులుగా విసిగిపోయి అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం ఆవులదట్ల, మారంపల్లి, డి.కొండాపురం, కదరంపల్లి, వేపరాల, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆవులదట్ల సబ్‌స్టేషన్ వద్ద అనంతపురం-రాయదుర్గం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సబ్‌స్టేషన్ సిబ్బందిని బయటకు పంపి కార్యాలయానికి గడియ పెట్టారు. రాయదుర్గం విద్యుత్ శాఖ ఎఇ బాలచంద్రకు రైతులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రిశేఖర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. సామర్థ్యానికి మించి 2వ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడటంతో సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర సబ్ స్టేషన్ల నుంచి లోడ్ సర్దుబాటు చేయాల్సి వస్తోందని తెలిపారు. మంగళవారం నాటికి సమస్య పూర్తిస్థాయిలో కొలిక్కి వస్తుందని, రైతులు సహకరించాలని కోరారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. నిరసన కార్యరకమంలో రైతులు ప్రసాద్, కృష్ణ, అనిల్, మున్నూరుస్వామి, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
విశాఖ నగరంలోని రామ్‌నగర్ జంక్షన్‌లో ఉన్న సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆస్పత్రి ఆరో అంతస్తులో మంటలు రేగి, పొగలు రావడంతో ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సూర్యాబాగ్, మర్రిపాలెం ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. సుమారు 90 అడుగుల ఎత్తులో ఉన్న ఆరో అంతస్తులో ఈ ప్రమాదం జరగడంతో బ్రాంటో స్లైలిష్ పరికరాల సాయంతో అగ్నిమాపక దళ సిబ్బంది పైకి చేరుకొని ప్రమాదాన్ని నియంత్రించారు. ప్రమాద విషయం తెలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అక్కడికి చేరుకొని సంఘటనా స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్ అధికారి సింహాచలం మీడియాతో మాట్లాడుతూ ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ఆరో అంతస్తులోని హెచ్ఆర్ విభాగం హెచ్ఒడి కార్యాలయంలో ఉన్న ఫైల్స్ దగ్ధమయ్యాయని వెల్లడించారు. అంతకుమించి నష్టం జరగలేదని తెలిపారు. నాలుగు, ఐదు అంతస్తులలో రోగులు ఉన్నారని, ప్రమాదం జరిగిన వెంటనే వారందరినీ సురక్షిత ప్రదేశానికి తరలించారని చెప్పారు. కొద్ది రోజుల క్రితం మెడికవర్ ఆస్పత్రిలో, అంతకు ముందు ఇండస్‌లో, ఇప్పుడు సెవెన్‌హిల్స్‌లో అగ్ని ప్రమాదాలు జరగడంతో ప్రయివేటు ఆస్పత్రుల్లో భద్రతపై విశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది.


ఆరో అంతస్తులో వ్యాపించినమంటలు

ఆక్వారంగం అభివృద్ధికి తోడ్పడాలి

- కేంద్ర బృందాన్ని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా)
మత్స్యకారులు, ఆక్వా రంగం అభివృద్ధి కోసం మచిలీపట్నంలో ఆక్వా, మెరైన్ ఫిషింగ్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర బృందాన్ని కోరినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ పనులను కేంద్ర పర్యావరణ, మత్స్యశాఖ అధికారుల బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా, మత్స్య పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర బృందానికి మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్ర చేపల్లో అంతరించిపోతున్న అరుదైన జాతులను గుర్తించి పరిరక్షించాల్సిన అవసరముందని వివరించారు. సముద్ర తీరం వెంబడి జాతీయ రహదారిని నిర్మించాలని కోరారు.
మడ అడవుల ప్రాధాన్యత తెలియక వాటిని నరికి వేస్తున్నారని, మడ అడవుల పెంపకానికి సహరించాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఇంకా పాత పద్ధతిలోనే కొంతమంది మత్స్యకారులు సముద్రంలో వేటను సాగిస్తున్నారని, వేటలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమని తెలిపారు. మత్స్యకారులకు సౌకర్యంగా మదర్ షిప్ అంశాన్ని బృందం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం బృందంలో ప్రాజెక్టు ఆన్ సస్టేయనబుల్ అక్వాకల్చర్ ఇండియా సహాయ ప్రతినిధి డాక్టర్ కొండ చెవ్వ, బయో డైవర్సిటీ ఎక్స్‌పర్ట్ అండ్ ఎఫ్ఎఒ ప్రాజెక్ట్ జాతీయ కోఆర్డినేటర్ సీమ భట్, లీడ్ టెక్నికల్ స్పెషలిస్ట్ మురళీధరన్, ఆక్వాకల్చర్ స్పెషలిస్ట్ విష్ణుభట్, నీలకంఠ మిశ్రా, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ నీనా కోషి, సలోమ్ ఏసుదాస్ ఉన్నారు.


కేంద్ర బృందంతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

యువతకు నైపుణ్య శిక్షణ అవసరం

- ప్రవాసాంధ్రులు ముందుకు రావాలి
- ఐటి శిక్షణ కేంద్రం ప్రారంభంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
అమెరికాలో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ నిపుణులు రాష్ట్రంలోని యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావాలని, రాష్ట్రంలో పలు ఐటి కంపెనీలు ప్రారంభించాలని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. గుంటూరులోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన ఫాంగ్ టెక్ ఐటి సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. సొంత రాష్ట్రానికి సేవలందించేందుకు ప్రవాసాంధ్రులు ముందుకు రావాలని కోరారు. అమెరికా వెళ్లాలన్న ఆకాంక్ష ఉన్న వారిని సాఫ్ట్‌వేర్ రంగంలో నైపుణ్యతను పెంచేందుకు ఇటువంటి శిక్షణ కేంద్రాలు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సరైన గైడెన్స్ లేకపోవడం వల్ల అనేక మంది యువత అమెరికా వెళినప్పటికీ అక్కడ ఐటి రంగంలో రాణించలేక చివరికి వివిధ రకాల వృత్తుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఐటిలో థియరీతోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా అవసరమన్నారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్న వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఐటిలో నైపుణ్యాన్ని పెంచేందుకు ఇలాంటి సంస్థలను నెలకొల్పి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఫాంగ్‌టెక్ ఐటి ట్రైనింగ్ సిఇఒ జిల్లెళ్లమూడి వెంకట్ మాట్లాడుతూ తొలుత 50 మందితో మూడు నెలల శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఐటి రంగంలో మెళుకవలు తెలియజేసి ఉద్యోగం వచ్చేలా తర్ఫీదు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, ఏలూరు సాంబశివరావు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు చుక్కపల్లి రమేష్, భాష్యం రామకృష్ణ, డాక్టర్ నిమ్మల శేషయ్య, తిలక్‌బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

సచివాలయ వ్యవస్థలో మార్పులు స్వాగతిస్తాం

- ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పును స్వాగతిస్తున్నామని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతపురం నగరంలోని ఎపిజిఇఎ జిల్లా కార్యాలయంలో ఆదివారం సచివాలయ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మార్పులను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరనున్నామని చెప్పారు. తమ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి అధ్యయనం చేసి మార్పులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో భాగస్వాములు అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన యాత్రికుల రద్దీ

- శ్రీవారి దర్శనానికి 18గంటలు

ప్రజాశక్తి- తిరుమల
తిరుమలలో సందర్శకుల రద్దీ పెరిగింది. శ్రీవారి దర్శనానికి సందర్శకులు పెద్దసంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. టోకెన్లు లేని సందర్శకులకు దర్శనానికి దాదాపు 18 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రూ.300ల ప్రత్యేక దర్శనానికి ఐదు గంటల సమయం పడుతోంది. స్వామి వారిని 73,535 మంది దర్శించుకోగా, అందులో 28,685 మంది తమ తలనీలాలు సమర్పించారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.65 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు తెలిపారు.

ఆరుగురు గంజాయి సరఫరాదారుల అరెస్టు

ప్రజాశక్తి-కాకినాడ
కాకినాడ పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురుని ఇంద్రపాలెం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి ఏడున్నర కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ డిఎస్‌పి డాక్టర్ కె హనుమంతరావు తెలిపారు. కాకినాడ ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లాకు చెందిన పాలెపు సతీష్, మరువాడ శ్రీనివాస్, బోయి వెంకటరమణ, కలపరెడ్డి శివకుమార్, వి ప్రభుతేజ, యానాంకు చెందిన క్రరి శ్యామ్యూల్ గంజాయి రవాణా చేస్తున్నారనే సమచారం వచ్చిందని తెలిపారు. ఈ మేరకు వారిపై నిఘా పెట్టి, కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ శివారు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారని చెప్పారు. ఆరుగురినీ అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ సిఐ డిఎస్‌పి చైతన్య కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వి మణికుమార్ పాల్గొన్నారు.

చైన్నై ఎక్స్‌ప్రెస్‌లో భారీ దోపిడీ

- గుంటూరు-సికింద్రాబాద్ మార్గంలో రెచ్చిపోతున్న దొంగలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
చెన్నై-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులను దుండగులు భయపెట్టి భారీ దోపిడీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వాతంత్ర్య దినోత్సవాల నేపథ్యంలో ఆర్‌పిఎఫ్ నుంచి కొన్ని బలగాలు ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై వెళ్లాయి దీంతో గుంటూరు-సికింద్రాబాద్ మార్గంలో రాత్రి వేళ రైళ్లలో దొంగతనాలకు దుండగులు యత్నిస్తున్నారు. గురువారం రాత్రి చెన్నై -హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో నడికుడి వద్ద ఆగగానే దొంగలు రైలులోకి ఎక్కి ప్రయాణికుల వద్దనున్న ఆభరణాలు దోచుకున్నారు. రైలు కదలగానే ఎస్8, ఎస్4, ఎస్10లో ముగ్గురు ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు లాక్కున్నారు. తుమ్మల చెరువు వద్ద చైన్ లాగి పారిపోయారు. బాధితులు సికింద్రాబాద్, హైదరాబాద్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ కేసులన్నింటిని పిడుగురాళ్ల రైల్వే పోలీసులకు బదిలీ అయ్యాయి. మరోవైపు శుక్రవారం రాత్రి డెల్టా ఎక్స్‌ప్రెస్, నర్సరావుపూర్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి ప్రయత్నించారు. పిడుగురాళ్ల, తుమ్మలచెరువు వద్ద రైళ్ల చైన్ లాగి దోపిడీకి ప్రయత్నించగా రైళ్లలో ఉన్న గార్డులు వారిని అడ్డుకోగా పారిపోయారు. రైళ్లను ఆపకుండా వెళ్లిపోవడంతో రైళ్లపై దుండగులు రాళ్లు విసిరారు. నిందితుల కోసం డాగ్ స్క్వాడ్‌తో గాలిస్తున్నామని, స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు.

ఆర్‌టిసిలో ఖాళీల భర్తీకి ఇయు డిమాండ్

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రభుత్వంలో విలీనం అయ్యాక గత ప్రభుత్వం కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలను నిర్లక్ష్యం చేసిందని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు విమర్శించారు. కారుణ్య నియామకాలు తప్ప ఏ కేటగిరిలోనూ ఒక్క ఉద్యోగిని కూడా నియమించుకునేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. ఆదివారం విజయవాడలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్యతో కలిసి మాట్లాడారు. ఆర్‌టిసిలో నెలకొన్న సమస్యలపై సోమవారం సిఎం సమక్షంలో జరిగే సమీక్షలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నీ కేటగిరీలలో వున్న పది వేల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగుల వైద్య సేవలకు సంబంధించి గతంలో వున్న పాత పద్ధతిని కొనసాగించాలని కోరారు. మెడికల్ అన్ ఫిట్ అయిన ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు చూపాలన్నారు. విలీనం అనంతరం పెండింగులో వున్న ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించి 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.


మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఫేస్ యాప్‌తో అవస్థలు


- తొలగించాలని మంత్రికి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - సాలూరు (విజయనగరం)
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఫేస్‌యాప్ వినియోగించే విధానం రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం ఉమామహేశ్వరి ఆధ్వర్యాన విజయనగరం జిల్లా సాలూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. విజయనగరం, గంట్యాడ ఐసిడిఎస్ ప్రాజెక్టులను ఏడు నెలల క్రితం పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఫేస్ యాప్ వినియోగించాలనే విధానం తొలగించాలని కోరారు. ఫేస్ యాప్‌లో లబ్ధిదారుల ఐరిస్ తీసిన తర్వాతనే సరుకులు పంపిణీ చేయాలన్న నిబంధన వల్ల పనిభారం పెరుగుతోందని చెప్పారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. ఆమెను కలిసిన వారిలో యూనియన్ విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి పైడిరాజు, ఎస్ అనసూయ, గౌరవాధ్యక్షులు వి లక్ష్మి, నాయకులు కె ప్రభావతి, పి కుమారి, జి చిట్టితల్లి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఉన్నారు.



"సామాజిక జీవితం లేకపోతే సాహిత్యం అనేదే సాధ్యం కాదు. ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది.

– మహాకవి శ్రీశ్రీ



రెండు నదులు

నాలుగ్గోడల ఊపిరాడని
సజీవ సమాధుల్లోంచి
కొంచెం సేపు మమ్మల్ని మేము
పునర్జీవింప చేసుకోవడానికి
చచ్చుబడిన నరాల్లో
కొంచెం ఉత్సాహం సెలైన్
ఎక్కించుకోవడానికి
శ్రుతి చేసి కొంటున్న సితారలం

నాలుగు వీధుల కూడళ్ల
ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
తేనీటి షాపుల ముంగిళ్ళు
అలల గలగలల నదీతీరాలు
పారదర్శక పానీయాల గాజు గ్లాసుల
గుండ్రటి బల్లల వీధి గదులు
వింజామరలు వీచే వాయువులు
పచ్చని పచ్చిక గీతాల పార్కులు
ఇవేమీ మా సమావేశ చిరునామాలు కావు

అస్పష్ట కవితల పసిపిల్లల ఏడుపుల
అతృప్త కాంక్షల సహచరుని సాధింపుల
సరిపడని నిద్రల సుదీర్ఘ రాత్రుల
బలవంతపు మెలకువల
తెరిపిడి పడని కళ్ళతో
తడబడే కాళ్ళతో
తెల్లవారుజాము ముహూర్తం
విరామం లేని పనుల ప్రారంభం
అప్రకటిత బానిసత్వం
శరీరంతో పుట్టిన సంకెళ్లు
తరతరాల అమ్మమ్మల నాయనమ్మల
తరగని చాకిరీల పెంజీకటి బతుకుల నేపథ్యం!

మిక్సీ పాప్ సంగీతం
గ్రైండర్ పాట కచేరీ
బట్టలు ఉతుకుతున్న దరువులు
అంట్లు తోముతున్న గరగరలు
మా నేపథ్య సంగీతం
కూరగాయలు తరుగుతూ
ఇల్లంతా తడిగుడ్డ పెడుతూ
కుంతల జలపాతంలా కబుర్ల జలపాతం

అంతులేని కాషాయీకరణ
బాల్యం మూపులపై పుస్తకాల బస్తాలు
ఉప్పు పప్పు చెప్పులపై జిఎస్టీ కొరడా
వంటింటి చూరు కింద కన్నీటి మున్నీటిలో
కదిలే కాగితం పడవలం
అపుడపుడూ ఆగ్రహ గంగలం
ఆవేశాల వరద గోదారులం
ఆలోచనల మాండవీ నదులం!

– మందరపు హైమవతి,
9441062732

సుడిగుండంలో ...

నేటి స్త్రీల స్వాతంత్ర్యం
నాలుగు దిశలా వెలుగులు వెదజల్లుతోంది
ఇంటా బయటా సంరంభమే.
ప్రతిభకు పట్టం కడుతూ, పూలతో అభిషేకిస్తూ
జేజేలు కొడుతున్నారు.
అన్ని రంగాల్లో రెడ్ కార్పెట్ పరుస్తూ...
ఒకనాటి స్త్రీల భయ బురఖాలు నేడు తీసేసినా
భయకంపిత ముగింపు పలుకుతున్నారు
పైపై డాంబికాలు, ఆడంబరాలే అన్నీ...
కనిపించని అగాధాలెన్నో..!
కరోనా వైరస్‌లా సమాజాన్ని కబళించేశారు
ఆధిపత్యపు లాలసులు.
నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తూ కొందరు
అంతా స్త్రీలదే అంటూ ...
బతుకు పాస్ వర్డ్ వారి కొనగోటితో
అమాయకంగా మురిసి ముక్కలయే అతివలకు
అమానుష ప్రేమ బంధాలు
కోబ్రా కౌగిలి!
కనిపించని సుడిగుండాల మధ్య
ఆమె లయ విన్యాసం
ఆనాడు గుంభనంగా గడిపిన వివాహిత స్త్రీ
నేడు నడిబొడ్డుపై వీరంగం చేస్తోంది స్వేచ్ఛ గా
భర్త అసంబద్ధ సంబంధాలకు, అన్యాయ ప్రవర్తనకు.
ఎంత ఎత్తు ఎదిగినా..
వేలి కొసలుతో ఆడిస్తూనే ఉన్నాడు
ఆడదాని బతుకును ఏం చేసినా..
స్త్రీల జీవితం మగాడి పద ఘట్టనలో
నలుగుతూనే ఉంది
ఇదేనా!?
స్త్రీలు కోరుకున్న స్వేచ్ఛ? స్వాతంత్ర్యం!?

– అమరజ్యోతి, 9182873598



యు(న)వత

అభ్యుదయ వాదులు
అభిమాన ధనులు
విక్రమించే వీరులు
దూకే సెలయేరులు
తూగే ఊయలలు
ఎగసిపడే అలలు
జ్ఞానపు ఊటలు
దేశ భవితకు ఊతలు
చిలిపి కోతులు
కొంటె కోణంగులు
హాస్య వల్లరులు
జ్వలించు భాస్కరులు
శాంతమున బుద్ధులు
పనికి కంకణ బద్ధులు
అపర సరస్వతులు
భవిష్యత్ నేతలు
భాగ్య విధాతలు


– అయినంపూడి వెంకట నారాయణ
(మన వేమన), 7981 422 372

అతడి లోపలి ఆమె పాడే పాటలు

ఎవడు విడిగా ఉండగలడు, మగ బతుకులకు వెలుగులనద్దే కొవ్వొత్తులనుంచి, గుడ్లల్లో నీళ్ల దిగమింగే గృహస్థ కనుపాపల నుంచి, చీకటి రాత్రులను చుట్టుకుని పాలిపోయిన పాలిండ్ల నిట్టూర్పుల నుంచి, జీవితాంతం రాజీకోటి రాసుకునే క్షమయా ధరిత్రి సీతాయణం నుంచి, మనుసు బిగువున అదిమిపట్టిన నెరవేరని కలల నుంచి.. ఎవడూ విడిగా ఉండలేడు. ఒంష్ట్రవ లోనే ష్ట్రవ ఉన్నపుడు ష్ట్రవతీలో కూడా ష్ట్రవ ఉన్నపుడు భాషగానే కాదు; భావంగానూ వేదనగానూ విడివడడం కష్టం కదా! సరే మరైతే విడివడక ఏం చేయగలరు? సహానుభూతి కన్నీళ్లు కార్చగలరు. చారికను చెరిపే చూపుడువేలి ఔదార్యం కాగలరు. చిటికెడు చేవనివ్వగలరు. పిడికెడు ధైర్యమవ్వగలరు. మెత్తని గుండె, చిక్కని చూపు, లోతైన వేదన గల కవైతే ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టగలడు. లండ సాంబమూర్తి కూడా అదే చేసాడు. కొంచెం అంతకు మించే చేసాడు. బయటకు నిటారుగా కనపడే బోలు స్త్రీలు, బాల్యంలోనే మోడులైన స్త్రీలు, ఏడుపే అలంకారమైన స్త్రీలు, సంగీతాన్ని దిగమింగిన కోకిలల లాంటి స్త్రీలు, పేలాల్సిన మందుపాతరలను గుండెల్లో సమాధి చేసిన అనేకానేక ఆమెకు మిగలని ఆమెలకు ఆమెను పునర్లిఖించి అందించాలని పూనుకున్నాడు. ఆ ప్రతిఫలనాలన్నింటినీ ఒక్క దగ్గర చేర్చి తిరుగుబాటునూ వేదననూ ఆవిష్కరించే ముఖచిత్రంగా కూర్చాలని నడుం కట్టాడు.

ఇవే ఆ కవితలు

ఇక్కడ వస్తువు, ఇతివృత్తం ఆమె. ఆమె అంటే తల్లి, సోదరి, స్నేహిత, సహచరి ఎవరైనా కావచ్చు. ఆమెను మాత్రమే వస్తువుగా చేసుకుని వచ్చిన ఒకే కవికి చెందిన కవితా సంపుటి ఇదే మొదటిదీ చివరిదీ కాకపోవచ్చు. అయినా ఇది ప్రత్యేకం. వస్తువు పేరుకు స్త్రీ ఒక్కటే అనే కానీ పరికించిన కోణాలు లెక్కలేనన్ని, తడిమిన లోతులు కొలవలేనన్ని. స్త్రీలు చాలా వాటితో సంభాషించగలరు. మగడి పెత్తనంతో ముచ్చట్లు పెట్టగలరు. పురుషుడి ఈగోతో సర్దుబాటు ఒప్పందం రాసుకోగలరు. కుటుంబపు మానిఫెస్టోలను అమలు చేయలేక పంచాయతీ పెట్టగలరు. అతడిని తోసిరాజని మరో దారినీ నిర్మించుకోగలరు. అతడి దారిని ధ్వంసమూ చేయగలరు. ఆ ఆమెకు సాంబమూర్తి అండనవుతానంటాడు. నీ కోసం ఓ గరళం చుక్కను ఇష్టంగా స్వీకరిస్తానంటాడు. మదర్స్ డే నాటి 'మిస్ యూ మాం' చక్కెరపూత చేదును సముద్రంలా సహించడమే తల్లితనం విషాదం అంటాడు. విస్తరిస్తున్న తామర కొలను దేశాన్ని నగ్నంగా ఊరేగించనున్న ప్రమాదం గురించి హెచ్చరిస్తూ వాపోతాడు. క్షమించడం కాదు; శిక్షించడం నేర్పించు అని తర్జనితో విన్నపం చేస్తాడు. ఒక్కో కవితలో ఒక్కో ఆమెను, ఆమెకు చెందిన దుఃఖానంద విషాద భావావేశ నిస్సహాయతల నిఘంటువులను తనదైన తాత్పర్యాలతో తిరగరాస్తాడు. అలా అని కన్నీళ్లు పిడచ కట్టేంత ఏడుపుగొట్టు కవి కాదు. ఆమెను దుర్గామాతగా చూడాలనుకునే కవి. అతనే సాంబమూర్తి లండ ఫ్రం ఉద్దానం.



ఏ కవి ఏ వస్తువును ఎక్కువగా ఎంచుకుంటాడో దాన్నిబట్టి అతని సాహిత్య వ్యక్తిత్వాన్ని అంచనా వేయొచ్చనే సాహిత్య తత్వశాస్త్రాన్ని నేను నమ్ముతాను. సాంబమూర్తికి స్త్రీ అంటే చెప్పలేనంత గౌరవం. ప్రతి స్త్రీలోనూ మాతృత్వాన్ని మాత్రమే చూడగల స్త్రీత్వం అతనిది. అతని లోపలి స్త్రీకి విశ్వ మహిళ లోతుగా పరిచయం. ఆమెను ఔపోసన పట్టిన కవి ఇతను. అతని లోపలి ఆమె పాడే పాటలే ఈ కవితలు.

సాంబమూర్తికి కవితా నిర్మాణ లోతుపాతులన్నీ తెలుసు. కవితను ఎలా ఆవిష్కరించాలో, ఎక్కడ అలంకరించాలో, ఎక్కడ సవరించాలో, ఎక్కడ రెచ్చగొట్టాలో, కవితకు ఎలా రెక్కలు తొడగాలో బాగా తెలుసు. అంతేకాక సాంబమూర్తి ఏ ఇతివృత్తాన్నయినా కవిత చేయగలడు. అందుకు వెన్నెల వాసనేసే ఇల్లు సాక్ష్యం. ఇటువంటి సారాన్ని ఎంచుకోవడం అనే చైతన్యాన్ని పక్కన పెడితే దాన్ని కవితగా మలచడం అంత సులువైన పనికాదు. అది కేవలం సాంబమూర్తికే సాధ్యం. ఇదే తరహాకు చెందిన మరో కవిత అమ్మ అడుగుతుంది. అమ్మ గురించి కవిత రాసే క్రమంలో తాను ఎంచుకున్న పద్ధతి ప్రత్యేకం. అమ్మ రాదులే కానీ వస్తే ఏమేం అడుగుతుంది అనే భావనను కవితగా చేసిన రూపం నిజంగా పాఠకుడి గుండెకింది తడికి చెమ్మనద్దుతుంది. అతని నిర్మాణ సామర్థ్యం చాలా గొప్పది. ఒక ఆరంభం, ఒక ఎత్తుగడ, ఒక నడక, ఒక ముగింపు... అన్నింటినీ బిగువుగా అల్లగల నేర్పు సాంబమూర్తికి ఉంది. ఇక్కడ ఆ సామర్థ్యానికి అద్భుతమైన వస్తువు తోడయింది.

అక్షరానికి ఉన్న అన్ని రంగులనూ ఇంద్రధనుస్సు చేసి ఎక్కుపెట్టాడు సాంబమూర్తి. కనుకనే తలుపు తెరవడానికి ప్రతిసారీ కారణం ఉండక్కరలేదనే స్వేచ్ఛ గురించి మాట్లాడాడు. నాన్న అన్న తమ్ముడు భర్త ... అందరూ కత్తికి ప్రత్యామ్నాయాలే అని మగహింస గురించి కత్తిగట్టాడు. జీవితాలను రెక్కలకు కట్టుకుని ఎగిరేవాళ్ల సొంత గూడు నిర్మించుకోలేని కలల్లోనే బతుకుతుంటారని ఆర్థిక వాస్తవాన్ని లెక్క కట్టాడు. అమ్మను నిత్యం తనతో పొదువుకుంటూనే నిత్యం అరిచే గుండెల కాడి కాకిని నిరసనగానే సహిస్తున్నాడు. చేతులు ఎటు చాచినా చీకటిలా తగిలే గోడల గదులు చిన్నవే కనుక వాటిని కూల్చి కొత్తవి కట్టుకొమ్మనే ఆశావహాన్నిస్తున్నాడు. మరీ ఒక్క మందలింపుకే ఊపిరి బలిపెట్టే ఆత్మాహుతి సున్నితత్వాల గురించి బెంగపెట్టుకుంటాడు. ఇవి కొన్ని మాత్రమే! ఇంకా ఎన్నెన్నో కోణాలు, లోతులు. అయితే కవి తన అనుభవం నుంచి మాత్రమే ఇతివృత్తాలను ఎంచుకుంటాడు అనేది నిజమే అయితే, సాంబమూర్తి స్త్రీలలో నాకు బహుజన దళిత స్త్రీ కనపడలేదు. బహుశా స్త్రీని వర్గ దృక్పథంలోంచి మాత్రమే చూడాలన్నది సాంబమూర్తి సిద్ధాంతమా? ఏమో! అది వేరే చర్చ.

పదబంధాలు ప్రతీకల అల్లికలో సాంబమూర్తిది చేయి తిరిగిన నైపుణ్యం. సరైన సందర్భానికి కుదిరే కచ్చితమైన ఇమేజ్‌ను తెచ్చుకోవడం సాంబమూర్తి చమత్కారం. మార్క్సును చదివిన పోతన అని చేయి తిరిగిన ప్రతీకకుడు మాత్రమే అనగలడు. ఆ నైపుణ్యమే శత్రువుతో బతకొచ్చుగానీ బూతద్దంతో బతకడం కష్టం అనిపిస్తుంది. ఆమె జీవం లేని గోడల మధ్య వేళ్లకింత చెమ్మయినా దొరక్కపోతుందా అని ఎదురుచూసే గాజు దీపం అని ఆ చమత్కారమే పలికిస్తుంది. నీది వసంతంలేని కాలం కథ అని అటువంటి భావశిల్పి మాత్రమే అనగలడు. అయితే చాలా సందర్భాల్లో కవితలో సాంబమూర్తి ప్రతీకలతో పరేడ్ చేస్తాడు. ఇమేజరీని గుప్పిస్తాడు. కానీ, కొన్ని ఇతివృత్తాలను కవిత్వం చేసేపుడు వెర్బల్ జగ్లరీ లేదా ఫోనెటిక్ గిమ్మిక్స్ భావ వ్యాకరణంలోకి ఇమడవు. సింపుల్ నెరేటివ్‌గా, లేదా అండర్ స్టేట్‌మెంట్‌గా యుఫెమిస్టిక్‌గా కొన్ని సందర్భాల్లో రాయడం దానికదే కవితాత్మకమైపోతుంది కూడా. రూపకం తెలుగు కవిత్వాన్ని ధ్వంసం చేస్తోందన్నది నా విశ్వాసం. కేవలం రూపకాన్ని పట్టుకుని వేళ్ళాడుతూ మహాకవులైనవారూ యుగకవులై పోదామనుకుంటున్నవారూ కుప్పలు తెప్పలు. సరే... ఇదే అంశాన్ని మరో కోణంలో మాట్లాడుకుంటే సాంబమూర్తి కవితలో పూర్తిగా బహిరంగమైపోతాడు. కవిగా తన ఇతివృత్తంలో మొత్తం స్పష్టంగా తనను తాను ఆవిష్కరించేసుకుంటాడు. మొత్తం విషయాన్ని పండు వలిచినట్టు వలిచి పెట్టేస్తాడు. ఇదొక నిర్మాణ పద్ధతి. కాదనను. కవితలో ఎప్పుడూ అంతా చెప్పేయకూడదని నేను నమ్ముతాను. చెప్పకుండా చెప్పడం కూడా ఉండకూడదు. కొంత దాచిపెట్టాలి. పాఠకుడు కవిత చివరనుంచి మళ్లీ మొదటికి వచ్చి ఏదో వెతుక్కోవాలి. కవి ఇంకా ఏదో చెప్పాల్సి ఉంది అని అనుకుని దానికోసం తాను అన్వేషణ మొదలుపెట్టాలి. పాఠకుడు కవిలోకి పరకాయ ప్రవేశం చేసి తనే ఆ ఖాళీని పూరించుకోవాలి. సింపుల్ నెరేటివ్ కవిత బాగుంటుంది అని చెపుతూ ఇదేమిటి? ఇది పూర్తి విరుద్ధంగా ఉంది కదా అనే సందేహం ఎవరికీ రానక్కరలేదు. ఓపెన్ పోయెమ్‌లో కూడా దాపరికం పాటించొచ్చు. అది కవితకు అందాన్నీ గాఢతనూ అద్దుతుంది. ఇది నా ఒకానొక ఆలోచన మాత్రమే!


సాంబమూర్తికి తన ఎజెండా ఏమిటో స్పష్టంగా తెలుసన్న విషయాన్నీ తను ఏ వైపు నిలబడి మాట్లాడుతున్నాడో తెలుసన్న విషయాన్నీ చెప్పే కవిత 'నగ్నదేశం'. భవిష్యత్తు ఏం కాబోతోందోనన్న ఆందోళన ఈ మణిపూర్ ఘటన కవితలో స్పష్టంగా కనపడుతోంది. మత రాజ్యం అనే చీకటి కిరణం ఈ వెలుగువాడలోకి దూసుకొస్తోందేమోనన్న భయం స్పష్టంగా వ్యక్తం అవుతోంది. అది చాలు, కవి రాజకీయ వ్యక్తిత్వాన్ని అంచనా కట్టడానికి. సాంబమూర్తి కవితది కథాకథన శైలి. తన ఇతివృత్తాన్ని ముందు కథగా మనసులో పేర్చుకుంటాడు. పాత్రలలాంటి పల్లవులనూ, చరణాలనూ అల్లుకుంటాడు. సంఘటనా పదచిత్రాల రాగాలను కూర్చుకుంటాడు. ఉత్కంఠ ఉత్కర్షలోకి పరుగు పందెపు గెలుపు గీత మీది చివరి అడుగు బరువుతో దూకి ఉచ్ఛస్వరమవుతాడు. కవిత పాటలాంటి కథగా పాఠకుడ్ని చేరుతుంది. ఉద్వేగం కవితగానో కథగానో పెయింటింగ్‌గానో మారేలోగా మనసు పొరల్లో దాని తీవ్రత క్రమక్రమంగా వేగంగా పలచబడుతుందన్న వాస్తవం సాంబమూర్తికి తెలుసు. ఏ ఫిల్టర్ వాడకుండా యథాతథంగా దాన్ని అనువదించేస్తాడు. అందుకే సాంబమూర్తి కవితలు స్వచ్ఛంగా వినిపిస్తాయి.

వచనం దెజావూ అయితే కవనం జమాయిస్ వూ. ఇది ఇంతకుముందెప్పుడో తెలుసు కదా అనిపిస్తుంది వచనం. ఇప్పుడు తెలిసినదాన్నీ తెలియనట్టు అనిపిస్తుంది కవనం. కవికి ఈ రెండింటి స్పృహ కచ్చితంగా ఉండాలి. ఇప్పటి కవులకు మంచి వచనం రాయడం రావడం లేదన్నది నా ఫిర్యాదు. కానీ, సాంబమూర్తి తన మాటగా రాసుకున్న వచనం చూస్తే ఇతను మంచి వచనం రాయగలడన్న హామీ దొరికింది. కేవలం స్త్రీ కేంద్రకంగా కవితల సమూహాన్ని ఒకే దగ్గర పొదివి పట్టుకుని చదవడం పాఠకుడికి కూడా ఒక అందమైన అనుభూతి. ఆ అనుభూతి కొంత ప్రేమనూ, కొంత దుఃఖాన్నీ, కొంత రాజకీయాన్నీ, కొంత చమత్కారాన్నీ, కొంత సామాజిక బాధ్యతనూ, కొంత వాగర్థాన్నీ, కొంత చైతన్యాన్నీ పంచేదైనపుడు అంతకు మించి ఇంకేం కావాలి? ఏ కవితా సంపూర్ణ సత్యం కాదంటుంటాం కదా. సాంబమూర్తి కవితలు సంపూర్ణం కంటే కొంచెం మాత్రమే తక్కువ సత్యాలు. ఆమెకు ఆమె ఎందుకు మిగలలేదో తెలుసుకోవడానికి లోపలికి కదలండి. తల్లిలాంటి ఆమెలోకి. బిడ్డలాంటి కవితల్లోకి. ప్రతులకు : 96427 32008

('ఆమెకు మిగలని ఆమె' పుస్తకానికి రాసిన ముందుమాట నుంచి కొన్ని భాగాలు)

– ప్రసేన్
98489 97241

బతుకు వెతలపై కథల వెలుతురు



కథలంటే పైపైని వున్నాయనుకున్నావేమో, అవి కల్పించడానికి చాలా గొప్ప ప్రతిభ వుండాలి. వాటి విలువ తెలుసుకోడానికి ఎంతో పరిజ్ఞానం వుండాలి. అవి చెప్పడానికి ఎంతో నేర్పు వుండాలి. అవి వినడానికి ఎంతో రుచి వుండాలి. అవి బోధపరుచుకోడానికి ఎంతో బుద్ధి సూక్ష్మత వుండాలి. కథలు కళ్ళకి వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనస్సుకి ఉత్సాహమూ, ఉల్లాసమూ కలిగిస్తాయి.

– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

తెలుగు కథాసాహిత్యంలో కథక చక్రవర్తిగా పేరొందిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు అతికొద్ది పదాల్లో కథా ప్రక్రియ గురించి చెప్పిన నిర్వచనం గొప్పగా అనిపిస్తుంది. కథ రాయడం వెనుక వుండాల్సిన రచయిత ప్రతిభనీ, కథ చదివిన పాఠకుడు పొందే ప్రయోజనాన్నీ ఈ మాటలు వ్యక్తం చేసాయి. జీవితాన్ని, సమాజాన్ని విస్తృతంగా అధ్యయనం చెయ్యడం, ముఖ్యంగా మనుషుల వ్యక్తిత్వాల్ని నిశితంగా, లోతుగా పరిశీలించడం ప్రతి కథకుడికీ అవసరం. ఆ అధ్యయనంలోంచి కథావస్తువును ఎన్నుకుని దాన్ని ఒక మంచి కథగా మలచడం కథారచయితలకు ఒక సవాలు. చూసింది చూసినట్లు చెప్పడం కథ కాదు. చూసిన సంఘటనకు, అంశానికి 'కళ'ను జోడించినప్పుడు చదువుతున్న పాఠకుడిలో ఆసక్తి కలుగుతుంది. ఒక వాస్తవిక సంఘటనను లేదా రచయిత ఎన్నుకున్న అంశాన్ని మంచికథగా మలచడానికి కథా ప్రక్రియ పట్ల అవగాహన ఎంతో ఉపయోగపడుతుంది. తెలుగులో కథా ప్రక్రియ ఎంతో అభివృద్ధి చెందింది. ఎన్నో శిల్ప ప్రయోగాలు తెలుగు కథపై జరిగాయి. ఎందరో కథకులు ఎన్నో గొప్ప కథలు రాసి తెలుగు కథను కీర్తి శిఖరాలకు చేర్చారు.

సమాజం మారుతుంది. ఎప్పటికప్పుడు మానవ జీవితం కొత్త వన్నెలు దిద్దుకుంటుంది. సామాజిక వ్యవస్థకీ, వ్యక్తికీ నిరంతరం ఘర్షణ తప్పదు. ఘర్షణలోంచే అభివృద్ధి, శాంతి సాధ్యమవుతాయి. మానవ సంస్కారం పెరిగే కొలదీ ఉత్తమ సమాజం సాధ్యమవుతుంది. ఉత్తమ మానవ సంస్కారానికి కథలు ఎంతో దోహదం చేస్తాయి. పాఠకుల మెదళ్ళకు చేరిన కథా వస్తువులు అనేక రూపాల్లో వ్యక్తం అయి మానవ సంస్కారంగా, సమాజ సంస్కృతిగా నిలదొక్కుకుని ఉన్నత మానవ సంబంధాలను నిర్మిస్తాయి.

కథ గురించి పైన చెప్పుకున్న అంశాలు శింగమాల సుబ్రహ్మణ్యం గారి 'వెలుగుపూలు' కథలలో మనకు కన్పిస్తాయి. ఈ కథా సంపుటిలో 16 కథలున్నాయి. ఈ కథలు మనకు ఒక కొత్త అనుభవాన్ని అందిస్తాయి. ఈ సంపుటిలోని 'పర్యావరణ స్పృహ' కథ ఈ కథలలో పైచేయిగా కనబడుతుంది. ప్రకృతి విధ్వంసానికి కారణమయ్యే 'కెమికల్' కంపెనీల కాలుష్యం, సహజ వనరుల కోసం సముద్ర తీరప్రాంతాలను ఆక్రమించుకుంటున్న వ్యాపార సంస్కృతిపై శక్తివంతమైన నిరసన వీరి కథల్లో చూస్తాం. ప్రకృతి పట్ల అమితమైన ప్రేమ ఈ కథల నిండా పరుచుకుని మనల్ని ఆకర్షిస్తుంది.

ఈ సంపుటిలోని తొలి కథ 'ఓ కడలి కథ' చదివిన ఏ పాఠకుడూ 'సముద్రం' అందాన్ని ఆస్వాదించకుండా వుండలేడు. ఈ కథలో రచయిత చాలా పరవశంతో తన



గ్రామంలోని సముద్రతీరాన్ని వర్ణిస్తాడు. మానవ జీవితాలకీ, సముద్రానికీ వున్న అనుబంధాన్ని రచయిత సహజరీతిలో వివరిస్తూ పాఠకుడిని కట్టిపడేస్తాడు. 'సముద్ర గర్భం నుండి బయటకు విసిరివేయబడిన గవ్వలు, శంఖాలు ఒడ్డుకు కొట్టుకొచ్చినాయ్. కొన్ని శిథిలమౌకుండా చాలా అందంగా కనిపిస్తున్నాయ్. యుద్ధంలో కాళ్ళు చేతులు తెగిపోయి మరణించిన సైనికుల్లాగా కొన్ని పడున్నాయ్. అవి జీవంతో ఉన్నప్పుడే వాటికి సముద్రుడు తన సామ్రాజ్యంలో స్థానం కల్పిస్తాడు. ప్రాణం పోయిన మరుక్షణం వాటిని బహిష్కరిస్తాడేమో!" , "చిన్నగా ఉండే ఎఱ్ఱటి ఎండ్రకాయలు కలుగుల్లో నుండి బయటికొచ్చి సందడి చేస్తున్నాయ్. ఎఱ్ఱటి దుస్తులు ధరించిన సైనిక పటాలాలు నాకు గౌరవ వందనం సమర్పిస్తున్నట్టుగా ఉంది."

ఇటువంటి తన్మయ వర్ణనలు 'ఓ కడలి కథ' కథలో అనేకం ఉన్నాయి. సముద్రాన్నీ, సముద్రంతో పెనవేసుకున్న జీవరాశుల్నీ, సముద్రతీరంతో అనుబంధం పెంచుకున్న మానవ సమూహాల్నీ పలవరించి పలవరించి పాఠకుడిని తనతో పాటు కథ చివరికి తీసుకెళతాడు రచయిత. కథ చివరిలో అప్పటిదాకా పాఠకుడు ఆస్వాదించిన సముద్ర సౌందర్యం విధ్వంసం అయ్యే దృశ్యాన్ని చూపించి ఆలోచనలో పడేస్తాడు రచయిత. ఈ సంపుటిలోని ప్రతి కథనూ ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో పాఠకుడి ముందుంచారు రచయిత.

'శిథిలగీతం' కథ కల్లుగీత కార్మికుడి కుటుంబానికి చెందిన హృదయ విదారక జీవిత దృశ్యం. ఒక పక్క శిథిలమవుతున్న 'కల్లుగీత వృత్తి'లో తాటిచెట్టుపైన గుండెపోటుతో మరణిస్తాడు కొడుకు. మరో పక్క ఉన్న కొద్దిపాటి పొలాన్ని రియల్ ఎస్టేట్ మాయా జూదంలో పెట్టి అప్పులపాలయి తాగుడికి బానిసవుతాడు మనవడు. తన కళ్ళ ముందు రెండు తరాల విధ్వంసాన్ని చూసిన వృద్ధుడి జీవిత కథ పాఠకుడికి కన్నీళ్ళు తెప్పిస్తుంది. ముందుచూపును ప్రదర్శించలేని ప్రభుత్వ విధానాల ఫలితంగా జీవికకు సరైన ప్రత్యామ్నాయం లేక నాశనమవుతున్న జీవితాలను కళ్ళకు కట్టిస్తుంది ఈ కథ. సరైన ఉపాధి కల్పించలేని ప్రభుత్వాలే ఈ పరిణామాలకు బాధ్యత వహించాలని ఇటువంటి కథలు హెచ్చరిస్తాయి. ఇంకా ఈ సంపుటిలో నిరుద్యోగం, మద్యం ప్రభావంతో జీవితాలు నాశనం కావడం, సముద్రతీర గ్రామాలు ఎదుర్కొనే తుఫాను బాధలు, కులవివక్ష, మూఢ నమ్మకాలు, పెత్తందారీ వర్గాల ఆధిపత్య భావజాలాలు వంటి కథాంశాలు పాఠకులను ఆలోచింపజేస్తాయి.

'మామా!... నేను ధర్మ విధ్వంసకుణ్ణా?' కథ భారతంలోని ఘటోత్కచుడి పాత్ర అంతఃసంఘర్షణను ఇతివృత్తంగా చేసుకుని రాసింది. ఈ కథాంశం భిన్నంగా ఉండి కథలోని ఘటోత్కచుడి ఆవేదనతో పాఠకుడు బాగా కనెక్ట్ అవుతాడు. సుబ్రహ్మణ్యం గారికి సమకాలీన సామాజిక అంశాల పట్లే గాక పురాణాల పట్ల కూడా నిశితమైన పరిశీలన, అవగాహన, అధ్యయనం ఉన్న విషయం మనకు ఈ కథ పట్టిస్తుంది.

సంఘర్షణను గురించి ఆలోచించేటప్పుడు దాని పరిష్కారాన్ని గురించి కూడా ఆలోచించాలి. కథలోని సంఘర్షణకు రచయిత పరిష్కారాన్ని చూపించాలా, అక్కరలేదా అన్న చర్చ అన్ని భాషల్లోనూ ఎంతో కాలంగా సాగుతూనే ఉంది. తప్పకుండా పరిష్కారాన్ని చూపించాలి అని కానీ, లేదా చూపించకూడదు అని కానీ వాదించటం మొరటువాదాలు. పరిష్కారం కథలో నుంచే సహజంగా రూపొందాలి. పరిష్కారాన్ని బలవంతంగా కథ మీద రుద్దటం శిల్పపరంగా బాధ్యతా రాహిత్యం మాత్రమే. అంతేకాకుండా అన్ని కథలకూ పరిష్కారాన్ని చూపించటం సాధ్యం కాదు.


– వల్లంపాటి వెంకటసుబ్బయ్య

వల్లంపాటి గారు చెప్పినట్టు 'వెలుగుపూలు' కథలు సరిగ్గా ఆ దృష్టిని కలిగిఉన్న కథలు. ఎంతో సంయమనంగానూ, అవసరమైనప్పుడు తగిన ఆవేశంగానూ ఆయా కథల్లోని పాత్రలను సహజరీతిలో చిత్రించారు. మధ్య మధ్యలో నెల్లూరు జిల్లా గ్రామీణ ప్రాంతాల మాండలిక పదాలు పలకరిస్తూ పాఠకుడికి ఆహ్లాదం కలిగిస్తాయి.

ఈ సంపుటికి శీర్షికగా పెట్టిన 'వెలుగుపూలు' దీపావళి పండగనాడు పేల్చే టపాసుల కాలుష్యంపై రాసిన కథ. పిల్లలకు ఈ టపాసుల పండుగంటే అమితమైన ఇష్టం. కాలుష్యాన్ని నివారిస్తూ పిల్లవాడి కోరిక తీర్చడానికి ఈ కథలోని తండ్రి ఏం చేసాడో తెలుసుకోవాలంటే 'వెలుగుపూలు' కథను చదవాల్సిందే. ఈ సంపుటిలోని కథలన్నీ మంచి ఆలోచనలను వెలిగించే కాంతిదీపాలు. రచయితకి ఇది తొలి కథాసంపుటి. ఈ కథలన్నీ ప్రముఖ పత్రికల్లో ప్రచురితమై, పాఠకుల ఆదరణ పొందినవే! మరిన్ని ఆలోచింపజేసే ఇతివృత్తాలతో ఎన్నో కథలు ఈ రచయిత నుంచి రావాలని ఆశిద్దాం.

(12.8.2024 సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరణ జరుగుతుంది.)

– వొరప్రసాద్,
94900 99059



గుణపాఠాలు

భయ్యా!
చెమర్చిన కళ్ళతోనే కవిత్వాన్ని చదువు
అతిశయించిన ఆనంద భాష్పాలతో కాదు
అక్షరాల్ని, పదాల్ని, వాక్యాల్ని
పొరలు పొరలుగా విడదీసి మరీ చదువు.
మనుషుల్ని ప్రేమించ గలిగిన వారే నీకు
తారసపడతారు

బయటి ప్రపంచంలో వెతికే అవసరమే లేకుండా
నీ అనుభూతుల ముడిసరుకులు
అనుభవాల గుణపాఠాలు అందులోనే
నీకు దొరికి పోతాయ్!

నిన్ను నీవుగా తెలుసుకోగలుగుతావ్
శూన్యంలోంచీ ఆర్తనాదాలు స్పష్టంగా
వినపడతాయ్
ఒక కొత్త ఊపిరిని ప్రాణవాయువుగా చేసి
నీ గుండెలనిండా నింపుతాయ్

భయాల్ని, భ్రమల్నీ బద్దలు కొట్టి
కాలుష్యం లేని మంచి తనాన్ని
నీకు పరిచయం చేస్తుంది
దాటి వచ్చిన జీవితం,
దాటవలసిన రేపటితనంలో
ఏమేం కోల్పోయిందీ తెలుసుకుంటావ్
భద్రంగా దాచుకోగలిగిన జ్ఞాపకాల గుప్త నిధిని
నీ సొంతం చేసుకుంటావ్
అవునా? కాదా?

ఇది నీ జీవన ప్రయాణమే సుమా
జాగ్రత్త, గమ్యం వచ్చేదాకా ఆగాలి
వచ్చాకనే దిగిపోవాలి, తప్పదు!

– రాధేయ

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి – 522501, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా. prajasavvadi@gmail.com

చేనేత రంగం అభివృద్ధికి కృషి

- మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం (కోనసీమ జిల్లా)

చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు తన వంతు సహకారం అందజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఆదివారపుపేట గ్రామంలో చేనేత సంఘ కార్మికులు ఏర్పాటు చేసిన క్లస్టర్ డేవలప్మెంట్ కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన చేనేత పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశామన్నారు. చేనేత కార్మికులకు తాను ఎంతో రుణపడి ఉంటానని చేనేత రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా రాష్ట్రంలోనే ఆదివారపుపేట గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులు పడుతున్న కష్టాలకు అతి త్వరలోనే ఉపాధి కల్పించేలా ఒక ప్రత్యేకమైన మార్గం చూపిస్తానన్నారు. మూతపడిన మగ్గాలకు త్వరలోనే మంచి రోజులు వస్తాయని తెలిపారు. ఆదివారపుపేట నేతన్నలకు అవసరమైన ఇన్వర్టర్స్ కర్మల కోసం ఒక ప్రణాళిక సిద్ధం చేసి వారికి ఆరోగ్య భద్రతను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని చేనేత మగ్గాలను మంత్రి పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు, అభిమానులు చేనేత సంఘం కార్మికులు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి నీటిమట్టం

- స్పిల్వే నుంచి 5,24,615 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటి మట్టం ఆదివారం నాటికి గణనీయంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 5,24,615 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 30.240 మీటర్లు, దిగువన 21.230 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించడంలో 'ఎంబియు' అగ్రగామి

- తెలంగాణా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- పట్టుదల, కార్యదీక్షతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : డాక్టర్ ఎం మోహన్ బాబు


పట్టభద్రులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి)

విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు నాణ్యమైన విద్యను అందించడంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం అగ్రగామిగా ఉండడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తిరుపతిలోని సాయినగర్‌లో మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మొదటి స్నాతకోత్సవ, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజ్ 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్ బాబు, సినీ నటుడు మంచు విష్ణు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విక్రమార్క, మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల కార్యదీక్షతతో ఉన్నత శిఖరాలకు ఎదిగాలని అన్నారు. స్థాయిని, హోదాను పక్కన పెట్టి పదిమందికి పయోగపడేలా జీవితాన్ని మలుచుకోవాలని సూచించారు. ఎంబియూ ఛాన్సర్ డాక్టర్ మంచు మోహన్ బాబు సినీ, విద్యారంగంలో కూడా నైపుణ్యాన్ని సాధించి అగ్రస్థానాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. సేవా దక్పథంతో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించి విద్యనందించడం అభినందనీయమన్నారు. ఎంబియూ చాలా విశాలమైన మానస సరోవరం లాగా చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. నేటి ప్రపంచంలో ఎదుటి వ్యక్తులను ఓడించడం కన్నా వారి మనసును గెలిచి అద్భుత విజయాలను సాధించడానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. మోహన్ బాబు మాట్లాడుతూ 32 సంవత్సరాల కషి ఫలితమే నేడు శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థలు యూనివర్సిటీ స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. తన గురువు గారైన దాసరి నారాయణరావు ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు ఎంబియూ, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. భట్టి విక్రమార్కను దుశ్శాలువ పుష్ప హారాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపకాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సెలర్ మంచు విష్ణు, ఉపకులపతి నాగరాజ రామారావు, రిజిస్టర్ సారథి, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి -బెంగళూరు ఆర్టీసి బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్ (శ్రీసత్యసాయి జిల్లా)

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి-44పై చుండూ రు క్రాస్ వద్ద ఆదివారం మధ్యా హ్నం 3 గంటల సమయంలో అదుపు తప్పి పుట్టపర్తి-బెంగళూరు బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు 13 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గుడిబండ పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి పుట్టపర్తికి వెళ్తున్న పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు గుడిబండ తాలూకాలోని చుండూరు క్రాస్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణిస్తుండగా, డ్రైవర్‌తో సహా 13 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో చిక్కబళ్లాపూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు బాగేపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. బస్సు అదుపుతప్పి పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోవడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే గుడిబండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే పుట్టపర్తి ఆర్టీసీ డిపో అధికారులు అక్కడికి చేరుకున్నారు. బస్సు బోల్తా పడిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన డ్రైవర్‌ను, ప్రయాణికులను బస్సులో నుంచి కిందికి దించి అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు.

కాంటూర్‌తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వండి

- పోలవరం నిర్వాసితుల సమస్యలపై మంత్రి నిమ్మలకు సిపిఎం వినతి
- త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి నిమ్మల హామీ


మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే పోలవరం ప్రాజెక్టు పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం పాలకొల్లులో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సిపిఎం బృందం నిర్వాసితుల సమస్యలపై సుమారు గంటన్నరపాటు చర్చించిందని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశామని వివరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయన్నారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో లేదని అన్నారు. ఫలితంగా ఈ 15 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతానికిపైగా పూర్తవ్వగా పునరావాస కల్పన 10 శాతం కూడా మించలేదన్నారు. పునరావాసం కల్పించిన వారికి సైతం అరకొరగానే సాగిందన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వాలు అశాస్త్రీయంగా గుర్తించాయని, 2022 జులైలో వచ్చిన వరదల్లో 41.5 కాంటూరుకు పైబడిన గ్రామాలు సైతం మునిగిపోయాయని గుర్తు చేశారు. జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 వేల కుటుంబాలు, లక్ష మంది నిర్వాసితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అత్యధికులు గిరిజనులేనని, వీరికి పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారని తెలిపారు. అక్కడ సమస్యలు కోకోల్లలుగా ఉన్నాయన్నారు. ఒక్క కుటుంబానికి కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, నూతన ప్రభుత్వం స్పందించి పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పంచాయతీలకు కాలనీలు అప్పగించి వాటికి అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుండి తరలించిన నిర్వాసితులకు ఆ గ్రామ పరిధిలోకి బ్యాంక్, ఇతర సేవలు మార్చాలని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తక్షణమే ఇవ్వాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ.10 లక్షలు చెల్లించాలని, 2022 ముంపు ఆధారంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు పరిహారం చెల్లించాలని, కాంటూర్‌తో సంబంధం లేకుండా పునరావాస కాలనీలకు తరలించి అలాట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నిర్వాసితుల గ్రామాల్లో వరదల సమయంలో పర్యటించామని, నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీలైనంత త్వరగా నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యలు పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మానుకొండ జీవరత్నం, నేత యర్నం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులు వద్దన్నా క్వారీ ఏర్పాటు తగదు

- జిఎంఆర్‌కు ఇచ్చిన క్వారీ అనుమతులు రద్దు చేయాలి : సిపిఎం


రామచంద్రపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని రామచంద్రపేట గ్రామస్తులు వద్దన్నా క్వారీ ఏర్పాటు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. జిఎంఆర్ సంస్థకు ఇచ్చిన క్వారీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రామచంద్రపేట గ్రామాన్ని ఆదివారం ఆయన సందర్శించి క్వారీ సమస్యపై గ్రామస్తులతో మాట్లాడారు. క్వారీ వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ముందు గ్రామస్తులు ఏకరువు పెట్టారు. బాంబు పేలుళ్లకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామన్నారు. దాని నుంచి వచ్చే శబ్దానికి ఇంటి పైకప్పు స్లాబు పెచ్చులు రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేలుళ్ల వల్ల ధూళి ఇళ్లల్లోకి వచ్చేస్తోందన్నారు. దీనివల్ల గ్రామంలో చాలామంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని వాపోయారు. ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోవడం లేదన్నారు. పోలీసుల పహారా మధ్య క్వారీ పనులను నిర్వహిస్తున్నారని, అర్థరాత్రి వచ్చి పోలీసులు నోటీసులు ఇచ్చారని అన్నారు. క్వారీ పనులను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. దీనిపై సూర్యనారాయణ మాట్లాడుతూ మీరంతా ముందుకొస్తే దీనిపై తప్పనిసరిగా పోరాటం చేస్తామన్నారు.

క్వారీ అనుమతులు వెంటనే రద్దు చేయాలి

గ్రామస్తులు వద్దన్నా క్వారీ ఏర్పాటు చేయడం దారుణమని, వెంటనే అనుమతులు రద్దు చేయాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. భోగాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు క్వారీ వద్దని చెప్పినా ప్రభుత్వం ఎలా అనుమతులిచ్చిందని ప్రశ్నించారు. ఉన్న క్వారీలతోనే గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేస్తే ఇక గ్రామాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుందని అన్నారు. రామచంద్రపేట గ్రామస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు ఉందని పేర్కొన్నారు. క్వారీ అనుమతులు రద్దు చేసి వారికి భద్రత కల్పించాలని కోరారు. గ్రామపెద్దలకు అర్థరాత్రి వేళ నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. దీనిని సిపిఎం ఖండిస్తోందన్నారు. క్వారీ అనుమతులు రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, స్థానిక నాయకులు బచ్చల సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరిశీలనకే పరిమితమైన శిక్షణా కేంద్రాలు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్య జిల్లా)

రెండేళ్లుగా క్రీడా శిక్షణ కేంద్రాలు పరిశీలనకే పరిమితమయ్యాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆరు క్రీడా శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు పలు గురుకుల, ఆశ్రమ పాఠశాలలను అధికారులు పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని భద్రగిరి, సీతంపేటలో వీటి ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. క్రీడల్లో మంచి ప్రతిభ, నైపుణ్యాలు ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి స్థానిక పాఠశాలలోనే ప్రత్యేకంగా క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని అప్పటి పరిశీలనకు వచ్చిన క్రీడా ప్రాధికార సంస్థ సహాయ డైరెక్టర్ పి.దేవానందం తెలిపారు. ఈ మేరకు జిల్లాలో సీతంపేట క్రీడా శిక్షణా కేంద్రంలో (బాలురకు) అథ్లెటిక్స్, హాకీ, జూడో, బాస్కెట్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, భద్రగిరిలో (బాలికలకు) అథ్లెటిక్స్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, హాకీ విభాగాల్లో శిక్షణ ఇస్తామని అధికారులు ప్రకటించారు. క్రీడా శిక్షణతో తమ సామర్థ్యాలను వెలికి తీయడానికి వీలుంటుందని విద్యార్థులు ఎంతో సంతోషపడ్డారు. ఆ ప్రక్రియ అమలు జరగకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా క్రీడా శిక్షణ పాఠశాలలను ఏర్పాటు చేసి స్థానికంగా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలిగే గిరిజన క్రీడాకారులు రాణిస్తారని గిరిజన నాయకులు అంటున్నారు.

శ్రీశైలానికి తగ్గుతున్న వరద

- 7 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుండి క్రమంగా నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి స్వల్పంగా 78,822 క్యూసెక్కుల నీళ్లు, తుంగభద్ర ద్వారా 30,117 క్యూసెక్కుల నీటితో కలిసి 1,08,939 క్యూసెక్కుల నీళ్లు జలాశయానికి చేరుతున్నాయి. జలాశయం నుండి 7 గేట్ల ద్వారా పది అడుగుల మేర ఎత్తి 1,89,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 882.70 అడుగులు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 202.9673 టిఎంసీలుగా నమోదయ్యింది. అలాగే ఎడమ గట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో 37,540 క్యూసెక్కుకులతో గడిచిన 24 గంటల్లో 16.681 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని, కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో 30,630 క్యూసెక్కుల నీటితో 15.340 మిలియన్ యూనిట్ విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. దిగువ నాగార్జునసాగర్‌కు 7 గేట్ల ద్వారా, విద్యుత్ ఉత్పాదన ద్వారా 2,57,300 క్యూసెక్కుకుల నీటిని విడుదల చేస్తున్నారు.



వారాంతపు సెలవులు.. పెరిగిన ప్రయాణికుల రద్దీ


- దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వారాంతపు సెలవులు రావడంతో తిరుపతికి ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే తిరుపతి నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు కీలక అప్డేట్ ఇచ్చింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పలు రూట్ల మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఈమేరకు వివరాలను వెల్లడించింది. తిరుపతి-కాచిగూడ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు పేర్కొంది. వికారాబాద్ - మహబూబ్‌నగర్, నర్సాపూర్ -సికింద్రాబాద్, హైదరాబాద్ - సంత్రాగాచి మధ్య ఈ రైళ్ల సేవలు అందించనున్నారు. కాచిగూడ- తిరుపతి (07653) దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడపనుంది. ఆగస్టు 14, 16న రాత్రి 22.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఇక తిరుపతి- కాచిగూడ (07654) మధ్య కూడా స్పెషల్ ట్రైన్ అందుబాటులో ఉంటుంది. ఆగస్టు 15, 17న రాత్రి 07.50 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 09.30 గంటలకు కాచిగూడ చేరుకోనుంది.ఈ ప్రత్యేక రైళ్లు ఉమానగర్, షాద్నగర్, జడ్చర్ల, మహబూబ్నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని అధికారులు ప్రకటించారు.

భూ యజమానులకే బీమా..!

- ప్రభుత్వ నిర్ణయంతో కౌలురైతులకు అన్యాయం
- ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు
- కౌలు రైతుల పేర్ల నమోదుకు యాజమానుల నుంచి వ్యతిరేకత
- ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు బీమా ఫలాలు
- వరదలు, భారీ వర్షాల ఇప్పటికే నష్టాలు
- ప్రభుత్వ తీరుపై కౌలురైతుల్లో తీవ్ర ఆవేదన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంటల బీమాపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరగనుంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిచేయడం వదిలేసి మళ్లీ అదేవిధంగా బీమా పాలసీ కొనసాగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌కు గత ప్రభుత్వం అమలు చేసిన బీమా విధానాన్నే అమలు చేయడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీల్లో దాదాపు ఏడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. వరదలు, భారీ వర్షాలకు ప్రతియేటా పెద్దఎత్తున పంటలను జిల్లా రైతాంగం నష్టపోతుంది. రెండుజిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వారే సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన కౌలురైతులకు మాత్రం బీమా పరిహారం అందడం లేదు. గత పాలకులు పంటల బీమాపై అనుసరించిన విధానాలే అందుకు ప్రధాన కారణం. ఇ-పంటలో నమోదైన రైతులకే పంటల బీమా వర్తించేవిధంగా గత ప్రభుత్వం ముందుకు సాగింది. కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు కౌలుకార్డులు అందకుండా చేసింది. చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన కౌలురైతులకు ఉరితాడుగా మారింది. ఇ-పంటలో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు ఎక్కడా నమోదు కావడం లేదు. ఒకవేళ క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు నమోదు చేయాలని ప్రయత్నిస్తే భూయజమానుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. దీంతో అధికారులు సైతం ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న రైతుల పేర్లు ఇ-పంటలో నమోదు చేయాలి. అప్పుడే కౌలురైతుల పేర్లు నమోదై ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, బీమా వంటి సాయం అందుతుంది. అది జరగడం లేదు. దీంతో ఆగ్రహం చెందిన కౌలురైతులు గత ఎన్నికల్లో టిడిపి కూటమికి గంపగుత్తగా ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం కొత్త బీమా పాలసీ తీసుకొస్తుందని, తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు న్యాయం..?

ఆరుగాలం శ్రమించి వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం వెంటనే అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో మార్పులు చేస్తూ భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ అంటూ నిబంధన విధించింది. దీంతో గ్రామాల్లో భూయజమానులు మరింత రెచ్చిపోతున్నారు. చట్టంలో ఆ నిబంధన తొలగిస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాలి. ఆ తర్వాత చట్టంలో మార్పులు చేయాలి. అప్పుడే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీచేస్తే క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు ఇ-పంటలో కౌలురైతులు పేర్లు నమోదు చేస్తారు. అలాకాకుండా కౌలురైతుల పేర్లు నమోదు చేయాలంటూ ఎన్నిమాటలు చెప్పినా క్షేత్రస్థాయిలో భూయజమానులు అందుకు అంగీకరించే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే తగిన ఉత్తర్వులు జారీచేసి ప్రస్తుత ఖరీఫ్‌లో కౌలురైతులకు బీమా అవకాశం ఇవ్వాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికే వరదలు, భారీ వర్షాలకు రెండు జిల్లాల్లో 32 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. ముందుముందు ఏదైనా నష్టం వాటిల్లినా బీమా నమోదు చేస్తే కౌలురైతులకు అండగా ఉంటుంది.

తిరుమలలో 15 నుంచి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమై 17వ తేదీతో ముగుస్తాయి. 14న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా ఆగమశాస్త్ర ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 15న పవిత్రాల ప్రతిష్ట, 16న పవిత్ర సమర్పణ, 17న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కృష్ణానది బోర్డు రాయలసీమలో ఏర్పాటు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాలన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్ల అయినప్పటికీ కృష్ణా బోర్డు కార్యాలయం రాష్ట్రానికి తరలించకుండా హైదరాబాద్‌లోనే ఉంచడం శోచనీయమన్నారు. మోడీ, బాబు, జగన్ వల్లే కృష్ణానది యాజమాన్యం బోర్డు రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. శ్రీశైలం రిజ ర్వాయర్ ఆధారంగా తెలుగుగంగ, హంద్రి-నీవా, వెలుగొండ, కల్వకుర్తి, ఎస్ఆర్ బిసి కుడి-ఎడమ జల విద్యుత్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వాయర్ సమీపంలోని రాయలసీమలో కృష్ణానది యాజ మాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు చేస్తే సమంజసమన్నారు. అలాగే పోల వరం ప్రాజె క్టు అథారిటీ కార్యాలయాన్ని రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేయాలని కోరారు. విభజన చట్టం సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజు ల్లో కృష్ణా బోర్డు యాజమాన్యం కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మార్చాల్సి ఉందన్నారు.

టిటిడి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్ల భారీ విరాళం

ప్రజాశక్తి- తిరుమల

పంజాబ్‌లోని ట్రైడెంట్ గ్రూపునకు చెందిన రాజిందర్ గుప్తా ఆదివారం టిటిడి ఎస్‌వి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు చెక్కును టిటిడి అదనపు కార్యనిర్వహణాధికారి సి.వెంకయ్య చౌదరికి తిరుమలలోని వారి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ఆర్జితసేవలు రద్దు

పవిత్రోత్సవాల్లో 14న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అదేవిధంగా, 15న తిరుప్పావడతోపాటు 15 నుండి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.

కొనసాగుతున్న ఎసిఎ క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్ -19 గ్రూప్ -బి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుకు చెందిన పరం వీర్‌సింగ్ డబుల్ సెంచరీ చేయడంతో ఆ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 697 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఐదు వికెట్ల నష్టానికి 381 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు 158.2 ఓవర్లలో 697 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని పరం వీర్‌సింగ్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి డబుల్ సెంచరీ చేశాడు. 361 బంతులను ఎదుర్కొని 19 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 208 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. మరో బ్యాట్స్ మెన్ కె. ఏ. ఎస్. ప్రసాద్ 112 పరుగులు(నాటౌట్), బి. యశ్వంత్ 132 పరు గులు (సెంచరీ)చేశాడు. నెల్లూరు జట్టులోని ఎస్. భార్గవ్ మహేష్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 49 ఓవర్లు వేసి అందులో ఆరు ఓవర్లు మేడిన్ చేసి 194 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకోవడం విశేషం. బాసిత్ బాబు రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 11.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 31 పరు గులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ లో విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో అధికత సాధించింది. వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కష్ణా జట్టుకు చెందిన వరుణ్ సాత్విక్ డబల్ సెంచరీ చేయడంతో ఆ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 573 పరుగుల భారీ స్కోరు సాధించింది. కష్ణా, కడప జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో కడప జట్టు 259 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 335 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 176.2 ఓవర్లలో 573 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి డబల్ సెంచరీ చేశాడు. 320 బంతులను ఎదుర్కొని 30 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 214 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 21.0 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 91 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో వెస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి జట్టు 231 పరుగులు చేసింది. శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 66 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారం భించిన వెస్ట్ గోదావరి జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 72.0 ఓవర్లలో 238 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 42.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది

సిఎం దృష్టికి సైనిక కార్పొరేషన్ అంశం

- హోం శాఖా మంత్రి అనిత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్థానిక ఎపి నిట్ ఆవరణలో కార్గిల్ విజయ్ దివాస్ రజతోత్సవ వేడుక ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి అనిత మాట్లాడుతూ సైనికులు 30 నుంచి 35 ఏళ్ల మధ్య రిటైర్ అవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న రెండు శాతం రిజర్వేషన్లను పెంచడానికి కేబినెట్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. టివిఆర్ విద్యాసంస్థల్లో విద్యార్థుల క్రమశిక్షణ చూస్తే గర్వంగా ఉందన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని మిలటరీ మాధవరం గ్రామానికి తాను ఒకసారి వస్తానన్నారు. పోలీసులను, జవాన్లను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖంగా ఉన్నారంటే దానికి కారణం సైన్యం అని అన్నారు. సైనిక స్కూల్ ద్వారా రాష్ట్రంలో ఒక వినూత్న ప్రయోగం చేసిన టిబిఆర్ విద్యా సంస్థల అధినేత భోగేశ్వరరావును అభినందించారు. సెంట్రల్ గవర్నమెంట్ స్టాల్స్, క్యాంటీన్ పెట్టాలని మాజీ సైనికులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సిఎం దృష్టిలో పెట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి అనిత చొరవ తీసుకోవాలని కోరారు. కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భోగేశ్వరరావును అభినందించారు. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ దేశంలో మనకు స్వేచ్ఛగా ఉన్నామంటే అది సైనికుల త్యాగ ఫలితమేనన్నారు. సైనికులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. అనంతరం పరమవీరచక్ర సంజయ్ కుమార్, చారులత తదితరులు సన్మానించారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : మెస్సర్స్ సన్ స్టార్ పాలీమర్స్, బ్లాక్ నెం. బి-05, ప్లాట్ నెం. 73, సర్వే నెం. 62, న్యూ ఆటోనగర్, కానూరు, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా - 521212. **సహఋణగ్రహీతలు : 1) శ్రీమతి చిలుకూరి శ్రీవల్లి,** భర్త : సి. హెచ్. వెంకట రమణారెడ్డి, హెచ్.నెం. 12-69, వెలగలపల్లి, ప్రగథవరం, చింతలపూడి మండలం, పశ్చిమగోదావరి జిల్లా - 534461. **2) బి. మిచెలిరాజ్,** 2-142, ఎస్‌డిఎ కాలనీ, అజయ్యపేట, నూజివీడు, సిద్ధార్ధనగర్, కృష్ణా - 521201. **హామీదారులు : 1) శ్రీమతి చెరుకూరి శ్రీవల్లి,** భర్త : సి. హెచ్. వెంకట రమణారెడ్డి, ప్లాట్ నెం. 8, బ్లాక్ నెం. 42, ఫేజ్ -4, ఇందిర ఆటోనగర్, గుంటూరు - 522001. **2) శ్రీమతి నేకంటి నాగమణి,** డి.నెం. 18-197-1, తుమ్మలవారి వీధి, సిద్ధార్థ ఫార్మసీ కాలేజి దగ్గర, అమ్మవారితోట, నూజివీడు - 521201. **మరణించిన బోడేటి మోహనరావు (హామీదారు) ఆస్తికి ఎ) బోడేటి మెర్లిన్,** 2-142, ఎస్‌డిఎ కాలనీ, అజయ్యపేట, నూజివీడు, సిద్ధార్ధనగర్, కృష్ణా - 521201. **బి) బి. మిచెలిరాజ్ ,** 2-142, ఎస్‌డిఎ కాలనీ, అజయ్యపేట, నూజివీడు, సిద్ధార్ధనగర్, కృష్ణా - 521201. **సి) బోడేటి మెల్విన్,** 2-142, ఎస్‌డిఎ కాలనీ, అజయ్యపేట, నూజివీడు, సిద్ధార్ధనగర్, కృష్ణా - 521201. **డి) బోడేటి మిష్మా,** 2-142, ఎస్‌డిఎ కాలనీ, అజయ్యపేట, నూజివీడు, సిద్ధార్ధనగర్, కృష్ణా - 521201.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ సన్ స్టార్ పాలీమర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 03-03-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 15-06-2023** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 03-03-2023**నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు క్రింద తెలుపబడ్డాయి : లేటు బోడేటి మోహనరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రీ, నూజివీడు గ్రామం, ఆర్.ఎస్.నెం. 700, డోర్ నెం. 2-142, రెల్లిపేట రోడ్డు, ఎస్‌డిఎ స్కూల్ ఏరియా, నూజివీడు-మైలవరం రోడ్డు దగ్గర మొత్తం 1800 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఆస్తి నందు 1103 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము మరియు అందలి నివాస బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** యడ్ల నీలయ్య గారి ఆస్తి, **దక్షిణం :** ముక్తేవి వెంకట చలపతిరావు మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **పడమర :** మైలవరం రోడ్డు మరియు సైడు కాలువ, **ఉత్తరం :** జాయింట్ రోడ్డు

తేది : 05-08-2024 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ శ్రీ ఈశ్వర కాటన్ జిన్నింగ్ మిల్, ప్రొ॥ మోదేపల్లి హైమావతి, భర్త : నరసింహారావు, 8/215/ఎ/ఎ, కేరాఫ్ : అంజని కాటన్ ప్రై.లి., అనంతవరప్పాడు రోడ్డు, ఏటుకూరు, గుంటూరు - 522017. **2) మోదేపల్లి హైమావతి,** భర్త : నరసింహారావు, చిరునామా : డి.నెం. 9-96, ఎన్ఆర్ఐ. హాస్పిటల్ దగ్గర, పెదపరిమి గ్రామం, తుళ్ళూరు మండలం, తాడికొండ, గుంటూరు, **3) కొండవీటి శ్రీనివాసరావు,** తండ్రి : కె. చిన్నరాజారావు, చిరునామా : ఫ్లాట్ నెం. 401, ఎస్‌విఆర్ మైసొనెట్, 4/2 వ లైన్, చంద్రమౌళినగర్, గుంటూరు - 522236. **4) కొండవీటి శివకుమారి,** భర్త : కె. శ్రీనివాసరావు, చిరునామా : ఫ్లాట్ నెం. 401, ఎస్‌విఆర్ మైసొనెట్, 1/2 వ లైన్, చంద్రమౌళినగర్, గుంటూరు - 522007.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ శ్రీ ఈశ్వర కాటన్ జిన్నింగ్ మిల్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 10-04-2019** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 19-06-2019** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 10-04-2019** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన స్థిరాస్తి వివరాలు ఈ క్రింద తెలుపబడ్డాయి.

ఆస్తి నెం. 1 : గుంటూరు జిల్లా, మల్లవరం గ్రామ పంచాయితీ, చిన్న పలకలూరు గ్రామ శివారు, మల్లవరం నుండి బండారుపల్లి రైల్వే గేటు దగ్గర, చిన్న పలకలూరు డి.నెం. 191/ఎ, ప్లాట్ నెం. 10 వద్ద 1293.86 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 11, **దక్షిణం :** ప్లాట్ నెం. 6, **పడమర :** ప్లాట్ నెం. 9, **ఉత్తరం :** 30 అ॥ వెడల్పు రోడ్డు, అక్షాంశాలు మరియు రేఖాంశాలు : 16.361824, 80.364835

ఆస్తి నెం. 2 : గుంటూరు జిల్లా, మల్లవరం గ్రామ పంచాయితీ, చిన్న పలకలూరు గ్రామ శివారు, మల్లవరం నుండి బండారుపల్లి రైల్వే గేటు దగ్గర, చిన్న పలకలూరు డి.నెం. 191/ఎ, ప్లాట్ నెం. 11 వద్ద 1283.87 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 12, **దక్షిణం :** ప్లాట్ నెం. 6 & 7, **పడమర :** ప్లాట్ నెం. 10, **ఉత్తరం :** 30 అ॥ వెడల్పు రోడ్డు, అక్షాంశాలు మరియు రేఖాంశాలు : 16.361824, 80.364835

ఆస్తి నెం. 3 : గుంటూరు, శ్యామలానగర్, 9వ లైన్, దగ్గరి డోర్ నెం. 2-14-159/10సి, నల్లపాడు డి.నెం. 217, 1110 చ॥అ॥ల విస్తీర్ణంలో ఆదిత్య ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ నందు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం. 101 కిచెందిన నివాస ఫ్లాట్. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము & కామన్ కారిడార్స్ & మెట్లు, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, పై సరిహద్దుల మధ్య 1570 చ॥అ॥ (కామన్ ఏరియాతో) తో మొత్తం కామన్ , జాయింట్ మరియు సౌలభ్య హక్కులతో సహా.

తేది : 05-08-2024 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ వీరాంజనేయ కాటన్ ట్రేడర్స్, శ్రీమతి సుభాషిణి రేగుల (ప్రొప్రయిటర్), డి.నెం. 20-18-197, 10వ లైన్, డి.ఎస్. నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **2) శ్రీ రేగుల నాగేశ్వరరావు,** డి.నెం. 20-18-197, 10వ లైన్, డి.ఎస్. నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **3) శ్రీమతి రేగుల నాగేంద్రం,** డి.నెం. 20-18-252, 7వ లైన్, డిఎస్ నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **4) శ్రీమతి రేగుల తిరుపతమ్మ,** డి.నెం. 20-18-424, 11వ లైన్, డి.ఎస్.నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **5) శ్రీ గుడె బ్రహ్మయ్య,** డి.నెం. 20-18-424, 11వ లైన్, డి.ఎస్.నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **6) శ్రీ రేగుల తిరుపతయ్య,** డి.నెం. 20-18-197, 10వ లైన్, డి.ఎస్.నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **7) శ్రీ చెర్రెడ్డి రవికుమార్,** డి.నెం. 20-18-189, 10వ లైన్, డి.ఎస్.నగర్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ వీరాంజనేయ కాటన్ ట్రేడర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-05-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 02-09-2021** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-05-2021**నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు క్రింద తెలుపబడ్డాయి : 1) శ్రీమతి రేగుల నాగేంద్రం గారి పేరిట గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గోరంట్ల, డి.నెం. 293/బి, ప్లాట్ నెం. 29 & 30 వద్ద 281 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 31 కి చెందిన స్థలము, **పడమర :** 30 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** వంగా తాతిరెడ్డి తదితరుల భూమి, **దక్షిణం :** శ్రీ గుడె రామన్న గారికి విక్రయించిన ఆస్తి.

2) శ్రీమతి రేగుల తిరుపతమ్మ గారి పేరిట గుంటూరు, ఏటుకూరు రోడ్డు, రామాలయం గుడి దగ్గర, డి.నెం. 19-8-48 వద్ద బృందావన్ ఎన్‌క్లేవ్‌లోని లావెండర్ సౌత్ బ్లాక్ నందు మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 304కి చెందిన 2 బెడ్ రూమ్ నివాస ఫ్లాట్. **హద్దులు : తూర్పు :** మున్సిపల్ కార్పొరేషన్ డ్రెయిన్, **పడమర :** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, **ఉత్తరం :** మున్సిపల్ కార్పొరేషన్ డ్రెయిన్, **దక్షిణం :** బి.ఎస్.ఎన్.ఎల్ మరియు ఇతరులకు చెందిన స్థలము. అక్షాంశాలు మరియు రేఖాంశాలు : 16.283609, 80.444522

3) శ్రీ గుడె బ్రహ్మయ్య గారి పేరిట గుంటూరు, ఆర్.అగ్రహారం, పట్టా నెం. 1053, బ్లాక్ నెం. 9 & 10, డి.నెం. 79, ప్లాట్ నెం. 26 వద్ద 200 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 17కి చెందిన స్థలము, **పడమర :** 25 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** ప్లాట్ నెం. 27కి చెందిన స్థలము, **దక్షిణం :** మై నాగలక్ష్మి గారికి విక్రయించిన ప్లాట్ నెం. 25 స్థలము.

4) శ్రీ రేగుల తిరుపతయ్య గారి పేరిట గుంటూరు, ఆర్. అగ్రహారం, బొంతపాడు రోడ్డు, కెవిఆర్ ఎస్టేట్ దగ్గర, గుంటూరు డి.నెం. 79, సమీప డోర్ నెం. 19-13-225, బ్లాక్ నెం. 9 & 10 వద్ద ప్లాట్ నెం. 15కి చెందిన 205 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** 25 అ॥ వెడల్పు రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం. 28కి చెందిన స్థలము, **ఉత్తరం :** పోకూరి వెంకటేశ్వర్లు గారి చట్టపరమైన వారసుల భూమి, **దక్షిణం :** చెర్రెడ్డి కవిత గారికి విక్రయించిన ప్లాట్ నెం. 15 కి చెందిన దక్షిణం భాగం. అక్షాంశాలు మరియు రేఖాంశాలు : 16.274691, 80.441612

5) శ్రీ సి. హెచ్. రవికుమార్ గారి పేరిట గుంటూరు, ఏటుకూరు రోడ్డు, సమీప డి.నెం. 19-16-243, ఆర్.అగ్రహారం డి.నెం. 71/4బి వద్ద 217 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** చెర్రెడ్డి లక్ష్మి గారికి చెందిన స్థలము, **పడమర :** విక్రేతలకు చెందిన మిగిలిన స్థలము, **ఉత్తరం :** ఇతరులకు చెందిన స్థలము, **దక్షిణం :** 30 అ॥ వెడల్పు రోడ్డు.

తేది : 05-08-2024 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ శ్రీ చంద్ర ఎంటర్‌ప్రైజెస్, ప్రొ॥ మేకల ఏడుకొండలు, డి.నెం. 19-9-176, హనుమాన్ నగర్, గుంటూరు - 522001. **2) మేకల ఏడుకొండలు** (ప్రొప్రయిటర్), తండ్రి : చంద్రరావు, డి.నెం. 35-102, ఫణిదరం, దామరపల్లి, తాడికొండ, గుంటూరు - 522018. **3) శ్రీ నల్లపనేని గరటయ్య (హామీదారు),** తండ్రి : శివ లింగయ్య, హెచ్.నెం. 6-39, గోర్లవారిపాలెం, గుంటూరు - 522018. **4) పసల కనక వీరరాజు (హామీదారు),** తండ్రి : మల్లయ్య, హెచ్.నెం. 5/100, ఫణిదరం (గ్రా), దామరపల్లి (పోస్టు), తాడికొండ మండలం, గుంటూరు జిల్లా - 522018. **5) నల్లపనేని రామాంజనేయులు (హామీదారు),** తండ్రి : శేషగిరిరావు, డోర్ నెం. 6-10, బొడ్డురాయి బజారు దగ్గర, గోర్లవారిపాలెం గ్రామం, గుంటూరు - 522018. **6) చల్లమల్ల మల్లిఖార్జునరావు (హామీదారు),** తండ్రి : యల్లమంద, డోర్ నెం. 5-69-51, 6/19 బ్రాడీపేట, గుంటూరు - 522002. **7) మేకల సురేష్ బాబు (హామీదారు),** తండ్రి : చంద్రరావు, డోర్ నెం. 5-10-2, ఫణిదరం (గ్రా), దామరపల్లి (పోస్టు), తాడికొండ మండలం, గుంటూరు జిల్లా - 522018.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ శ్రీ చంద్ర ఎంటర్‌ప్రైజెస్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 11-05-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 09-11-2021** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 11-05-2021**నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు క్రింద తెలుపబడ్డాయి : ఆస్తి వివరము నెం. 1 : గుంటూరు, తాడికొండ, శ్రీ రామ లింగేశ్వర టెంపుల్ & ఫణిదరం చెరువు దగ్గర, దగ్గరి డోర్ నెం. 5-102/1, పాత డోర్ నెం. 5-102, వార్డు నెం. 5, దామరపల్లి గ్రామ డి.నెం. 533 వద్ద మొత్తం 184 చ॥గ॥లు (118 + 66) విస్తీర్ణంలోని నివాస భూమి & బిల్డింగ్. **హద్దులు : డాక్యుమెంట్ నెం. 1488/2012, తేది : 27-04-2012 : తూర్పు :** బజారు, **దక్షిణం :** పసల జయకుమార్ గారి ఆస్తి, **పడమర :** పంచాయితీ బజారు, **ఉత్తరం :** మేకల కన్నయ్య గారి ఆస్తి. **హద్దులు : డాక్యుమెంట్ నెం. 3900/2014, తేది : 07-08-2014 : తూర్పు :** బజారు, **దక్షిణం :** మేకల ఏడుకొండలు గారి ఆస్తి, **పడమర :** పంచాయితీ బజారు, **ఉత్తరం :** మేకల శ్రీనివాసరావు గారి ఆస్తి. కో ఆర్డినేట్ - 16.360156, 80.394428

ఆస్తి వివరము నెం. 2 : గుంటూరు, తాడికొండ మండలం, ఫణిదరం గ్రామ పంచాయితీ, దామరపల్లి శివారు, దామరపల్లి గ్రామం, డి.నెం. 513 వద్ద 3388 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** మేకల వెంకటేశ్వరరావు గారి ఆస్తి, **దక్షిణం :** పొలిమేర డొంక, **పడమర :** కర్నాటి ఆంజనేయులు గారి భూమి, **ఉత్తరం :** కర్నాటి కోటేశ్వరరావు గారి భూమి, కో ఆర్డినేట్ - 16.357295, 80.385404

ఆస్తి వివరము నెం. 3 : గుంటూరు, తాడికొండ మండలం, ఫణిదరం గ్రామ పంచాయితీ, దామరపల్లి శివారు, దామరపల్లి గ్రామం, డి.నెం. 513 వద్ద 3146 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** మేకల వెంకటేశ్వరరావు గారి ఆస్తి, **దక్షిణం :** పొలిమేర డొంక, **పడమర :** కర్నాటి ఆంజనేయులు గారి భూమి, **ఉత్తరం :** కర్నాటి కోటేశ్వరరావు గారి భూమి, కో ఆర్డినేట్ - 16.357104, 80.385661

తేది : 05-08-2024 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ లలిత కాటన్ ట్రేడర్స్, ప్రొ॥ శ్రీమతి తోట పద్మావతి, భర్త : లేటు సుబ్బారావు, ఫ్లాట్ నెం. 4బి, 4వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్, సీతారామనగర్, 3వ లైన్, గుంటూరు - 522001. **2) శ్రీమతి తోట పద్మావతి,** భర్త : లేటు సుబ్బారావు, ఫ్లాట్ నెం. 4బి, 4వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్, సీతారామనగర్, 3వ లైన్, గుంటూరు - 522001. **3) శ్రీ తోట మహేష్ బాబు,** తండ్రి : లేటు సుబ్బారావు, ఫ్లాట్ నెం. 4బి, 4వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్, సీతారామనగర్, 3వ లైన్, గుంటూరు - 522001

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ లలిత కాటన్ ట్రేడర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 27-09-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 13-12-2022** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 27-09-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు క్రింద తెలుపబడ్డాయి : ఆస్తి నెం. 1 : శ్రీమతి తోట పద్మావతి, భర్త : లేటు సుబ్బారావు గారి పేరిట గుంటూరు, నెహ్రూ నగర్, 11వ లైన్, కొత్త గుంటూరు రైల్వే స్టేషన్ గుంటూరు, వీవర్స్ కాలనీ, కొత్త అసెస్ట్ నెం. 64781, పాత అసెస్ట్ నెం. 16924/ఎ, కొత్త జి.యం.సి డోర్‌నెం. 39-3-226, డోర్ నెం. 8-13-59, డి.నెం. 420/ఎ, 420/బి వద్ద ప్లాట్ నెం. 5కి చెందిన 256 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస భూమి మరియు బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** తిరమదాస్ శ్రీశైలం గారి ఆస్తి, **పడమర :** గంజి సీతారామయ్య గారి ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** సింగం జనార్ధన్ గారి ఆస్తి, కో-ఆర్డినేట్స్ : 13.608260, 80.455402

ఆస్తి నెం. 2 : శ్రీమతి తోట పద్మావతి, భర్త : లేటు సుబ్బారావు & శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి : లేటు సుబ్బారావు గార్ల పేరిట గుంటూరు, బ్యాంకర్స్ కాలనీ, 10/2 రాజీవ్ నగర్, డోర్ నెం. 7-6-846/156, డి.నెం. 382/ఎ1 వద్ద ప్లాట్ నెం. 41కి చెందిన 277.45 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస భూమి. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 40, **పడమర :** ప్లాట్ నెం. 42, **ఉత్తరం :** ప్లాట్ నెం. 35, **దక్షిణం :** 30 అ॥ వెడల్పు రోడ్డు. కో-ఆర్డినేట్స్ : 16.313877, 80.453370

ఆస్తి నెం. 3 : శ్రీమతి తోట పద్మావతి, భర్త : లేటు సుబ్బారావు & శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి : లేటు సుబ్బారావు గార్ల పేరిట గుంటూరు, బ్యాంకర్స్ కాలనీ, 10/2 రాజీవ్ నగర్, డోర్ నెం. 7-6-846/156, డి.నెం. 382/ఎ1 వద్ద ప్లాట్ నెం. 42కి చెందిన 277.45 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస భూమి. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 41, **పడమర :** ప్లాట్ నెం. 43, **ఉత్తరం :** ప్లాట్ నెం. 34, **దక్షిణం :** 30 అ॥ వెడల్పు రోడ్డు. కో-ఆర్డినేట్స్ : 16.313877, 80.453370

ఆస్తి నెం. 4 : శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి : లేటు సుబ్బారావు గారి పేరిట గుంటూరు, ఆరోగ్య ప్రాథమిక కేంద్రం వెనుక, పెదపలకలూరు గ్రామం, పెదపలకలూరు నుండి దాసరిపాలెం వెళ్ళు రోడ్డు దగ్గర, డి.నెం. 543/ఎ, 543/బి వద్ద ప్లాట్ నెం. 22, 23, 24 & 25కి దక్షిణ భాగాన 778.90 చ॥గ॥ల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ భూమి. **హద్దులు : తూర్పు :** కందుల ఆంజనేయులు గారి ఆస్తి, **పడమర :** 30 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** మీనుగు శ్రీనివాసరావు గారి ప్లాట్ నెం. 25 ఆస్తి, **దక్షిణం :** ప్లాట్ నెం. 21, కో-ఆర్డినేట్స్ : 16.334161, 80.376892

ఆస్తి నెం. 5 : శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి : లేటు సుబ్బారావు గారి పేరిట గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, చైతన్యపురి, 6వ క్రాస్ రోడ్డు, 4వ లైన్, సాయిబాబా రోడ్డు ఎక్స్‌టెన్షన్, దగ్గరి డోర్ నెం. 19-4-325, వార్డు నెం. 4-21-56/4, కొరెటిపాడు డి.నెం. 45/బి1, డోర్ నెం. 4-21-56/4, వద్ద 88 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** షేక్ ఆదంసాహెబ్ మరియు ఇతరుల ఆస్తి, **పడమర :** 30 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** గండూరి జ్యోతి గారి ఆస్తి, **దక్షిణం :** చంటి పుట్టారెడ్డి గారి ఆస్తి, కో-ఆర్డినేట్స్ : 16.323128, 80.430654

తేది : 05-08-2024 | **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

మణిపూర్‌లో మళ్లీ కాల్పులు

- నలుగురి మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లో ఇంకా పరిస్థితులు అదుపులోకి రాలేదు. తాజాగా తెంగ్నౌపాల్ జిల్లాలో పల్లెల్ ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు మృతి చెందారు. శుక్రవారం రాత్రి ఈ కాల్పుల ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. ఒకే కమ్యూనిటీకి చెందిన రెండు గ్రూపుల మధ్య ఘర్షణ ఈ కాల్పుల ఘటనకు దారితీసిందని తెలిపారు. ఈ ఘటన తరువాత ఈ ప్రాంతంలో భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహించారనీ, ఎవర్నీ అరెస్టు చేయలేదని తెలిపారు. మణిపూర్‌లో గత ఏడాది మేలో ప్రారంభమైన హింసాకాండ ఇంకా కొనసాగుతూనేఉంది. ఈ హింసాకాండలో దాదాపు 300 మంది మరణించారు. వేలాది మంది ఇప్పటికీ సహాయక శిబిరాల్లోనే ఉన్నారు.

బాంబుపేలుడులో మాజీ ఎమ్మెల్యే భార్య మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో బాంబు పేలుడు జరిగింది. ఆదివారం జరిగిన ఈ ఘటనలో సైకుల్ మాజీ ఎమ్మెల్యే యమ్‌థాంగ్ హౌకిప్ భార్య మరణించారు. శనివారం సాయంత్రం యమ్‌థాంగ్ హౌకిప్ నివాసం నివాసం పక్కనే బాంబు పేలుడు జరిగినట్లు సైనికులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆయన రెండో భార్య సపం చారుబాలా తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారని తెలిపారు. ఆ సమయంలో హౌకిప్ కూడా నివాసంలోనే ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

దర్యాప్తు జరపాల్సిందే

అదానీ గ్రూప్, సెబీ చీఫ్‌పై చర్యలు చేపట్టాలి

హిండెన్‌బర్గ్ నివేదికపై ప్రతిపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రిసెర్చ్ తాజా నివేదిక దేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అదానీ గ్రూపులో సెబీ ఛైర్‌పర్సన్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారంటూ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణ నేపథ్యంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అదానీ గ్రూపుపై సెబీ జరుపుతున్న విచారణలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అదానీ గ్రూప్ కుంభకోణాలపై, సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బుచ్ క్రోనీ క్యాపిటలిజంపై తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశాయి.

'అదానీ గ్రూప్ అనేక అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ దర్యాప్తు విషయంలో సెబీ ఆసక్తి చూపకపోవడానికి కారణం ఏమిటో ఇప్పుడు అర్థమైంది. దీనిని సుప్రీంకోర్టు నిపుణులు కూడా గమనించలేకపోయారు. గత సంవత్సరం జనవరిలో అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ ఓ నివేదికను వెలువరించింది. ఈ గ్రూపు జరిపిన 13 అనుమానాస్పద లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నామని సుప్రీంకోర్టు నిపుణుల కమిటీకి సెబీ తెలిపింది. ఇప్పటికీ అది పూర్తి కాలేదు. ఆగస్టు 12వ తేదీ వరకూ పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మోడీ ప్రభుత్వం తొలుత చెప్పింది. 9వ తేదీ నాడే సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు. దీనికి కారణమేమిటో ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోంది' అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ విమర్శించారు. సెబీ చీఫ్, ఆమె భర్తపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కూలంకషంగా దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సంతృప్తికరమైన వివరణలు ఇవ్వాలని, లేకుంటే దర్యాప్తు జరపాలని ఆయన కోరారు.

అదానీ గ్రూపులో సెబీ చీఫ్ పెట్టుబడుల వ్యవహారాన్ని చూస్తుంటే క్రోనీ క్యాపిటలిజం స్పష్టంగా కన్పిస్తోందని టిఎంసి నాయకురాలు మహువా మొయిత్రీ తెలిపారు. సెబీ చీఫ్‌పై ఇడి, సిబిఐ దర్యాప్తు జరుపుతాయా అని ఆమె ప్రశ్నించారు. గతంలో అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టును కోరారు. అదానీ గ్రూపు కంపెనీల వివరాలు కోరుతూ సెబీకి గతంలో తాను లేఖ రాశానని, అయితే దానికి ఆ సంస్థ ఎందుకు సమాధానం ఇవ్వలేదో ఇప్పుడు అర్థమవుతోందని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నాయకురాలు ప్రియాంక చతుర్వేది వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ నివేదిక చూస్తుంటే ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ ప్రమేయం ఉన్నట్లు కన్పిస్తోందని అదే పార్టీ ప్రతినిధి ఆనంద్ దూబే అన్నారు. ఇప్పుడు ఎవరు విచారణ జరుపుతారన్నదే ప్రశ్న అని అంటూ పార్లమెంట్ సమావేశాలను ముగించిన తీరు చూస్తుంటే ఏదో తప్పు జరిగినట్లు కన్పిస్తోందని చెప్పారు.

అదానీ గ్రూపుపై ఫిర్యాదులను సక్రమంగా విచారించాం : సెబీ

అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా వచ్చిన అన్ని ఫిర్యాదులను సక్రమంగా విచారించామని సెబీ ఆదివారం తెలిపింది. హిండెన్‌బర్గ్ శనివారం చేసిన ఆరోపణలపై ఆదివారం తొలిసారిగా స్పందిస్తూ సెబీ ఈ విషయాన్ని తెలిపింది. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బచ్ ఎప్పటికప్పుడు ఈ విచారణల్లో పాలుపంచుకునేవారని తెలిపింది. అదానీ గ్రూప్‌పై హించడెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కూడా విచారణ పూర్తి చేశామని తెలిపింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని మాధబి బచ్, ఆమె భర్త ధవల్ బచ్ ఇప్పటికే ఖండించారు.

దేశాన్ని సర్వనాశనం చేశారు : నెటిజన్ల విసుర్లు

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. 'హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చిన కొన్ని నిమిషాలలోనే సెబీ ఇండియా తన ట్విటర్ ఖాతాను మూసేసింది. భయానక వాతావరణం కన్పిస్తోంది' అని రోషన్ రాయ్ అనే నెటిజన్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సెబీ చీఫ్ మాధబి బచ్... ఈ ఇద్దరు మహిళలు కలిసి ఒంటిచేత్తో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని సన్నీ దాస్ అనే నెటిజన్ మండిపడ్డారు. ఆయన నిర్మల, మాధబి బచ్ కలిసి ఉన్న ఫొటోను కూడా పోస్ట్ చేశారు.



సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బచ్ — ధావల్ బచ్

అదానీ గ్రూపులో సెబీ చీఫ్ వాటాల నికర విలువ రూ.83 కోట్లు

- హిండెన్‌బర్గ్ ప్రధాన అభియోగాలివే...

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ గ్రూపుతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పూరి బచ్‌కు ఉన్న సంబంధాలను బహిర్గతం చేసింది. బెర్ముడా, మారిషస్‌కు చెందిన కొన్ని ఆఫ్‌షోర్ ఫండ్లు గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలో ఉన్నాయని, వీటిలో సెబి ఛైర్‌పర్సన్, ఆమె భర్త ధావల్ బచ్‌కు ఉన్న వాటాల నికర విలువ రూ.83 కోట్ల వరకూ ఉండవచ్చునని చెప్పింది. అదానీ గ్రూపుకు వ్యతిరేకంగా గత సంవత్సరం జనవరిలో తాను ఇచ్చిన నివేదికపై చర్యలకు ఈ కారణంతోనే సెబీ విముఖత చూపిందని వివరించింది. ఈ ఆరోపణలను సెబీ ఛైర్‌పర్సన్, ఆమె భర్త తోసిపుచ్చారు. ఇవి నిరాధార ఆరోపణలని అంటూ హిండెన్‌బర్గ్ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని మండిపడ్డారు. సెబీ చీఫ్‌పై హిండెన్‌బర్గ్ పది ప్రధాన ఆరోపణలు చేసింది. ఆ వివరాలు...

షెల్ కంపెనీలకు నిధుల తరలింపు

అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చి 18 నెలలు గడిచాయి. అదానీ గ్రూప్ సంస్థల వాటాల విలువను కృత్రిమంగా పెంచేందుకు మారిషస్ ఫండ్లను ఉపయోగించారు. వీటిలో సెబీ చీఫ్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారు. మారిషస్, ఆఫ్‌షోర్ షెల్ కంపెనీల వివరాలను అదానీ గ్రూపు బయటపెట్టనప్పటికీ సెబీ ఎలాంటి ఆసక్తి చూపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అదానీ డైరెక్టర్ ఒకరు ఇండియా ఇన్ఫోలైన్ లిమిటెడ్ (ఐఐఎఫ్ఎల్) ద్వారా 'ఐపిఇ ప్లస్ ఫండ్' పేరిట మారిషస్‌లో ఓ చిన్న ఆఫ్‌షోర్ ఫండ్‌ను ఏర్పాటు చేశారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ గ్రూపు సొమ్మును గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆ ఫండ్‌లోకి తరలించారు. అందుకోసం విద్యుత్ పరికరాల కొనుగోలు ఇన్వాయిస్‌ను పెంచి చూపారు. దానిని భారతీయ మార్కెట్‌లో పెట్టుబడికి ఉపయోగించారు. నిధుల తరలింపు కోసం అదానీ గ్రూపు ఉపయోగించుకున్న రెండు ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో సెబీ చీఫ్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారని విజిల్‌బ్లోయర్ పత్రాల ద్వారా తెలుస్తోందని హిండెన్‌బర్గ్ అంటోంది. అదానీ ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో ఎవరు పెట్టుబడులు పెట్టారో సెబీ కనుగొనలేకపోయిందని సుప్రీంకోర్టు తెలిపింది. గత సంవత్సరం హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికలో ఆ పెట్టుబడిదారుల సమాచారం ఉన్నా, దానిని సెబీ ఛైర్‌పర్సన్ పరిశీలించలేదు.

ఆఫ్‌షోర్ సింగపూర్ సంస్థపై ఆసక్తి

ఈయూ రీసర్జెంట్ ఫండ్, ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్ పేరిట భారతీయ సంతతికి చెందిన అదానీ వాటాదారులే ఐఐఎఫ్ఎల్‌ను నిర్వహించారని, వారిపై కూడా సెబీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని హిండెన్‌బర్గ్ తెలిపింది. 2017 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకూ మాధబి బచ్ సెబీలో హోల్‌టైమ్ సభ్యురాలు. అరోగా పార్ట్‌నర్స్ అనే ఆఫ్‌షోర్ సింగపూర్ కన్సల్టింగ్ సంస్థపై ఆమె నూరు శాతం ఆసక్తి చూపారు. సెబీ ఛైర్‌పర్సన్‌గా నియమితురాలు అయిన రెండు వారాల తర్వాతే... అంటే 2022 మార్చి 16న ఆమె తన వాటాలను భర్త ధావల్ బచ్‌కి బదిలీ చేశారని హిండెన్‌బర్గ్ ఆరోపిస్తోంది. ధావల్ బచ్ 2019లో బ్లాక్‌స్టోన్ కంపెనీ సీనియర్ సలహాదారుగా నియమితులయ్యారు. అప్పుడు ఆమె సెబీలో హోల్‌టైమ్ సభ్యురాలుగా ఉన్నారు. లింకెడిన్‌లో ధావల్ బచ్ ప్రొఫైల్‌ను పరిశీలించగా... రియల్ ఎస్టేట్‌లో కానీ, క్యాపిటల్ మార్కెట్లలో కానీ ఆయన ఎన్నడూ ఫండ్ కోసం పనిచేయలేదని తేలింది.

వాస్తవాన్ని మరుగుపరచి...

ధావల్ బచ్ బ్లాక్‌స్టోన్ కంపెనీ సీనియర్ సలహాదారుగా, ఆయన భార్య సెబీ అధికారిగా ఉన్న సమయంలో బ్లాక్‌స్టోన్ సంస్థ మైండ్‌స్పేస్ అండ్ నెక్సస్ సెలక్ట్ ట్రస్టును స్పాన్సర్ చేసింది. ఇది భారత్‌లో ఐపిఓకు సెబీ అనుమతి పొందిన రెండవ, నాలుగవ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రెయిట్). బ్లాక్‌స్టోన్‌కు ధావల్ బచ్ సీనియర్ సలహాదారుగా ఉన్నప్పుడు రెయిట్ నిబంధనల్లో గణనీయమైన మార్పులకు సెబీ అనుమతి ఇచ్చింది. రెయిట్‌ను 'భవిష్యత్తులో తన అనుకూల ఉత్పత్తులు'గా మాధబి బచ్ అభివర్ణించారు. దానిలో మదుపు చేయాల్సిందిగా పెట్టుబడిదారులను ప్రోత్సహించారు. ఈ పెట్టుబడుల కారణంగా తన భర్త సీనియర్ సలహాదారుగా ఉన్న బ్లాక్‌స్టోన్ కంపెనీ లబ్ది పొందుతుందన్న వాస్తవాన్ని మాత్రం ఆమె దాచిపెట్టారు.

జీతం కంటే ఆ రాబడే అధికం

తన భర్త డైరెక్టర్‌గా ఉన్న భారతీయ కన్సలింగ్ కంపెనీ అరోగా అడ్వయిజరీలో మాధబి బచ్‌కు 99 శాతం వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. 2022లో ఈ సంస్థ కన్సల్టెంగ్ సేవల ద్వారా 261,000 డాలర్లు ఆర్జించిందని, సెబీలో ఆమె పొందే జీతం కంటే ఇది 4.4 రెట్లు అదనమని తెలిపింది.

నిరాధారం : సెబీ ఛైర్‌పర్సన్

హిండెన్‌బర్గ్ తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని, దాని నివేదిక దూషణలతో కూడి ఉన్నదని మాధబి పురి బచ్ ఓ ప్రకటనలో తెలిపారు. తమకు సంబంధించిన అన్ని ఆర్థిక పత్రాలను ఎవరికైనా, ఏ సంస్థకైనా చూపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. హిండెన్‌బర్గ్ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడడం విచారకరమని ఆమె పేర్కొన్నారు.

'ఇ-శ్రమ'లో 29.8 కోట్ల మంది నమోదు

ముంబయి: అసంఘటిత కార్మికుల సమగ్ర జాతీయ డేటాబేస్‌ను రూపొందించడం కోసం 2021లో కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ-శ్రామ్ పోర్టల్‌ని ప్రారంభించింది. ఈ-శ్రామ్‌పోర్టల్ అసంఘటిత కార్మికులకు యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్), ఈ-శ్రామ్ కార్డ్‌లను అందించటం ద్వారా రిజిస్టర్ చేసుకోవటానికి, వారికి మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించబడింది. గతనెల 26 నాటికి 29.8 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో స్వీయ-డిక్లరేషన్ ప్రాతిపదికన నమోదు చేసుకున్నారు. ఈ-శ్రమ్ కార్డులను పొందారు. అసంఘటిత కార్మికులకు నైపుణ్యం పెంపుదల, అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందించటానికి ఈ-శ్రామ్ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌తో అనుసంధానించబడింది.

నేడు దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

- అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలు బంద్
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి డాక్టర్స్ అసోసియేషన్ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కలకత్తా ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎఫ్ఒఆర్‌డిఎ) ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసింది. జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సోమవారం నాటి నిరసన నుంచి అత్యవసర సేవలను మినహాయిస్తున్నట్లు ప్రకటించింది. ఘటనకు బాధ్యులను 48 గంటల్లోపు అరెస్టు చేయకపోతే దేశవ్యాప్త నిరసనలకు దిగాల్సి వస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హెచ్చరించింది. నేరం, దానికి దారి తీసిన పరిస్థితులపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. మహిళా డాక్టర్ల భద్రత పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరింది.

ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఛాతీ వైద్య విభాగంలో పిజి రెండో సంవత్సరం విద్యార్థిని అయిన బాధితురాలు (31) డ్యూటీలో ఉండగా దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేసినట్లు శవ పరీక్ష నివేదికలో వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన సంజయ్ రాయ్ స్థానిక పోలీస్ విభాగంలో విపత్తుల నిర్వహణ బృందంలో వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఆర్‌జి కర్ ఆసుపత్రి చెక్‌పోస్టు వద్ద బాధ్యతలు నిర్వహిస్తూ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడికి ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.



కోల్‌కతాలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా ఆందోళన

ఉరి తీయాలనుకుంటే తీయండి : నిందితుడు

నిందితుడు సంజయ్‌రాయ్‌కు సెల్దా కోర్టు 14 రోజుల పోలీస్ రిమాండ్‌కు ఆదేశించింది. అతడి మొబైల్‌లో అభ్యంతరకర ఫోటోలు, వీడియోలను పోలీసులు గుర్తించారు. మహిళా సహోద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు తేలింది. దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా, ఉరితీయాలనుకుంటే తీయండి అన్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు డాక్టర్లను కూడా పోలీసులు విచారిస్తున్నారు.

బాధిత కుటుంబానికి బెదిరింపులు

బాధిత కుటుంబానికి అండగా ఉండాల్సిన పశ్చిమ బెంగాల్ పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మౌనంగా ఉండాలని ఒక పోలీసు అధికారి ఫోన్‌లో బెదిరించారని బాధిత కుటుంబం చెప్పినట్లు వైద్యుల బృందం తెలిపింది. బాధిత కుటుంటాన్ని పరామర్శించడానికి ఆదివారం వెళ్లినప్పుడు ఈ విషయాన్ని తెలిపినట్లు వైద్యులు చెప్పారు. హత్య తరువాత అత్యాచారం జరిగిందని కొంత ప్రచారం చేస్తున్నారని, ఇది నిజం కాదని చెప్పారు. అత్యాచారంతోపాటు దారుణంగా హింసించిన తరువాతే ఆమెను హత్య చేశారని, పోస్టుమార్టం నివేదిక ఇదే విషయాన్ని నిర్ధారిస్తుందని చెప్పారు. ఈ దారుణంలో మరికొందరి ప్రమేయం కూడా ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. తమ కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని, వాస్తవాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితురాలి తండ్రి చెప్పారు. దురదృష్టకర ఘటన అని, హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి తమ ప్రభుత్వం వెనుకాడదని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఘటనపై సిబిఐ దర్యాప్తు చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

నిష్పక్షపాత విచారణ జరపాలి

నేడు, రేపు దేశవ్యాప్త ఆందోళనకు ఎస్ఎఫ్ఐ పిలుపు

ట్రైనీ డాక్టర్‌పై దారుణ హత్య, అత్యాచారానికి నిరసనగా సోమ, మంగళవారాల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్ ప్రకటన విడుదల చేశారు. నిర్భయ కేసును తలపించే విధంగా కలకత్తాలో దారుణమైన నేరం జరిగిందని, తొలుత ఆత్మహత్యగా తప్పుదారి పట్టించారని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనల తరువాతే పోస్టుమార్టం నిర్వహించారని తెలిపారు.

కాలేజీ ముందు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ధర్నా, పోలీసుల లాఠీఛార్జ్

ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ముందు ఆందోళన చేసిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలు, వైద్య విద్యార్థులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడ్డారు. విచక్షణా రహితంగా లాఠీఛార్జి చేయడంతోపాటు అమ్మాయిలతో మగ పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు.

బాధిత కుటుంబానికి సిపిఎం పరామర్శ

ఎస్ఎఫ్ఐ మాజీ ప్రధాన కార్యదర్శి సుజన్ చక్రవర్తి, ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి దీప్సితాధర్, రాష్ట్ర కార్యదర్శి దేబంజన్ డే బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైద్యులు, వైద్య విద్యార్థుల ఆందోళన

మెడికల్ కాలేజీ విద్యార్థులు, వైద్యులు నిరసన చేపట్టారు. క్యాంపస్‌లో సెక్యూరిటీ పెంచాలంటూ తాము గతంలో చేసిన అనేక అభ్యర్థనలు బుట్టదాఖలయ్యాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్ తొలగింపు

సుదీర్ఘకాలంగా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సంజయ్ వశిష్టను తొలగిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. కాలేజీ డీన్ బుల్బుల్ ముఖోపాధ్యాయ్‌కు ఈ బాధ్యతలను అప్పగించింది.

బంగ్లాదేశ్ సిజెగా రెఫాత్ అహ్మద్ ప్రమాణం


ఢాకా : బంగ్లాదేశ్ నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సయ్యద్ రెఫాత్ అహ్మద్ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. దేశ అధ్యక్షులు అధికారిక నివాసం దర్బార్ హాల్‌లో మధ్యాహ్నం 12:45 గంటలకు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. రెఫాత్ చేత అధ్యక్షులు మహమ్మద్ షహబుద్దీన్ ప్రమాణస్వీకారం చేయించారు. తాత్కాలిక ప్రభుత్వ అధిపతి ముహమ్మద్ యూనస్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆందోళనల కారణంగా శనివారం ఓబాయిదుల్లా హసన్ ప్రధాన న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. హసన్‌తో పాటు బంగ్లాదేశ్ అత్యున్నత కోర్టు అప్పిలేట్ డివిజన్‌కు చెందిన మరో ఐదుగురు న్యాయమూర్తులు శనివారం రాజీనామా చేశారు. బంగ్లాదేశ్ 25వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రెఫాత్ అహ్మద్‌ను నియమిస్తున్నట్లు అధ్యక్షులు షహబుద్దీన్ శనివారం ప్రకటించారు.

కుర్స్క్‌లో ఉక్రెయిన్ స్థావరం ధ్వంసం

మాస్కో : కుర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ సైనిక స్థావరాన్ని ధ్వంసం చేసినట్లు రష్యా తెలిపింది. సుమారు వెయ్యి మంది ఉక్రెయిన్ సైనికులు, భారీ ఆయుధాలు, వాహనాలతో కుర్స్క్‌లో చొరబడినట్లు అంతకుముందు వార్తలొచ్చాయి. దీంతో అప్రమత్తమైన రష్యన్ సైన్యం క్షిపణులతో దాడి చేసి ఆ స్థావరాన్ని ధ్వంసం చేసింది. ఈ దాడిలో బ్రిగేడ్ కమాండ్‌కు చెందిన 15 మంది సిబ్బంది మరణించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఐదు ఉక్రెయిన్ సైనిక వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, 20 మంది సిబ్బందిని అదుపులోకి తీసుకున్నట్లు అది పేర్కొంది. ఇందుకు సంబంధించి డ్రోన్‌తో చిత్రీకరించిన ఒక వీడియోను కూడా విడుదల చేసింది. ఈ వీడియోలో ఉక్రెయిన్‌కు చెందిన ఒక సైనిక వాహనం కూడా కనిపిస్తోంది. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంపై దాడి ఈ రెండు దేశాల మధ్య సంఘర్షణ ప్రారంభమైన తరువాత జరిగిన అతి పెద్ద దాడిగా భావిస్తున్నారు. చొరబాటుదారులపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని రష్యా తెలిపింది. ఈ దాడిని ఉరెచ్చగొట్టే చర్యగా ఉక్రెయిన్ పేర్కొనడాన్ని రష్యా ఖండించింది. ఉక్రెయిన్ నుంచి చొరబాట్లు ఆగిపోయాయని, వారి సైన్యం అంతా తిరిగి వెనక్కి వెళ్లిపోయిందని రష్యా తెలిపింది.

హారిస్‌కే ఆధిక్యం

నాలుగు పాయింట్ల తేడాతో వెనకబడ్డ ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తన ప్రత్యర్థి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కన్నా నాలుగు పాయింట్లు ఆధిక్యంలో ఉన్నట్లు తాజా ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది. మూడు కీలకమైన రాష్ట్రాలు విస్కాన్సిన్, పెన్సిల్వేనియా, మిచిగాన్‌లలో ట్రంప్ పై ఆధిక్యత సాధించారు. నవంబర్ ఐదవ తేదీన జరిగే ఎన్నికల్లో ఎవరికి ఓటెయ్యాలనుకుంటున్నారన్న అంశంపై న్యూయార్క్ టైమ్స్ / సియానా కాలేజ్ పోల్ ఈ నెల 5-9 మధ్య మూడు రాష్ట్రాల్లోని 1,973 మంది ఓటర్ల అభిప్రాయాన్ని సేకరించింది. దీనిలో కమలాహారిస్‌కు 50 శాతం, డోనాల్డ్ ట్రంప్‌కు 46 శాతం మంది మద్దతు లభించింది. మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను ఉపాధ్యక్షుడిగా ప్రకటించిన అనంతరం ఈ సర్వే చేపట్టారు. దీని ప్రకారం.. పెన్సిల్వేనియాలో 4.2 పాయింట్లు, మిచిగాన్‌లో 4.8 శాతం, విస్కాన్సిన్‌లో 4.3 పాయింట్లు ఆధిక్యంలో కమలా హారిస్ ఉన్నట్లు తేలింది. వయోభారం వల్ల వచ్చిన సమస్యలతో సతమతమవుతున్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సొంత పార్టీ నుంచి వ్యతిరేకత రావడంతో పోటీ నుంచి తప్పుకుని, కమలా హారిస్‌ను తన వారసురాలిగా ప్రకటించారు. కమలా హారిస్‌ను డెమక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ట్రంప్ గ్రాఫ్ పడిపోనారంభించింది. అధ్యక్షురాలిగా కమలా హారిస్ సమర్థవంతంగా సేవలందిస్తారని స్వతంత్ర ఓటర్లు ఆశిస్తున్నారు.

ఉత్తరాదిలో భారీ వర్షాలు..

- ఒక్కరోజే 29 మంది మృతి
- పంజాబ్‌లో వాహనం కొట్టుకుపోయి తొమ్మిది మంది మృతి

న్యూఢిల్లీ: ఉత్తర భారతాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీతోపాటు పలు చోట్ల వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఆదివారం ఒక్కరోజే 29 మంది మరణించారు. పలు చోట్ల అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. జమ్ముకాశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు.

పంజాబ్‌లోని హోషియార్‌పుర్‌లో ఓ ఎస్‌యువి వాహనం వరదలో కొట్టుకుపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందితోపాటు డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.

రాజస్థాన్‌లో రెండురోజుల్లోనే 16 మంది మృతి

రాజస్థాన్‌లో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ సందర్భంగా జరిగిన వివిధ ఘటనల్లో శనివారం ఇద్దరు, ఆదివారం 14 మంది చనిపోయారు. కరౌలీ జిల్లాలో అత్యధికంగా 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

హిమాచల్‌లో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో, ముగ్గురు అమ్మాయిలు ప్రాణాలు కోల్పోగా ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 280 రోడ్లను మూసివేశారు. ఉత్తర ప్రదేశ్‌లో వర్షం కారణంగా భవనం కుప్పకూలిన ఘటనలో ఓ మహిళ, ఏడేళ్ల చిన్నారి చనిపోయారు. దేశరాజధాని న్యూఢిల్లీతోపాటు సమీప ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. అనేక ప్రాంతాలు నీట మునగడంతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోహిణీ ప్రాంతంలోని సెక్టార్ 20లో ఏడేళ్ల బాలుడు వరద నీటిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. మరో వ్యక్తి విద్యుదాఘాతంతో చనిపోయాడు.



ఢిల్లీ అశోక్‌నగర్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు

జల్‌గ్రామ్‌గా గుర్‌గ్రామ్...

గుర్‌గ్రామ్‌లోనూ భారీ వర్షం కారణంగా అనేక సెక్టార్లు చెరువులను తలపించాయి. మోకాళ్లలోతు వరద నీటితో అనేక వాహనాలు చిక్కుకుపోయాయి. మిలీనియమ్ సిటీగా పేరొందిన గుర్‌గ్రామ్.. జల్‌గ్రామ్‌గా మారిందంటూ సోషల్ మీడియాలో పలు వీడియోలు వైరల్‌గా మారాయి. హిమాచల్, అరుణాచల్, అస్సాం, పంజాబ్, హరియాణా, బిహార్ రాష్ట్రాల్లో ఆదివారం సాయంత్రం అనేక చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసినట్లు భారత వాతవరణశాఖ వెల్లడించింది.

పట్టు కోసం పాట్లు

- రాజ్యసభలో మెజారిటీకి బిజెపి తంటాలు



న్యూఢిల్లీ : లోక్‌సభలో సాధారణ మెజారిటీకి ఆమడ దూరంలో నిలిచి మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడుతున్న బిజెపి, ఇప్పుడు రాజ్యసభపై పట్టు కోసం తంటాలు పడుతోంది. కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవడం కోసం ఎగువసభలో మెజారిటీ సాధించాలని ప్రయత్నిస్తోంది. సెప్టెంబరులో రాజ్యసభలోని 12 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. వీటిలో అత్యధిక స్థానాలను గెలుచుకొని, ఎగువసభలో ఆధిపత్యం చెలాయించేందుకు బిజెపి వ్యూహాలు రచిస్తోంది. వక్ఫ్ సవరణ బిల్లు సహా పలు కీలక బిల్లులు ఆమోదం పొందాలంటే రాజ్యసభలో మెజారిటీ సాధించడం బిజెపికి తప్పనిసరి. ఎగువసభలో ప్రస్తుతం ఉన్న 229 స్థానాలలో బిజెపికి 87 మాత్రమే ఉన్నాయి. భాగస్వామ్య పక్షాలతో కలిపి ఎన్‌డిఎ బలం 105కు చేరింది. ఆరుగురు నామినేటెడ్ సభ్యులు ఎలాగూ అధికార పక్షానికే ఓటు వేస్తారు కనుక ప్రభుత్వ పక్షాన 111 మంది సభ్యులు ఉంటారు. సాధారణ మెజారిటీకి 115 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుంది. అంటే ప్రస్తుతం మెజారిటీకి ప్రభుత్వం నాలుగు స్థానాల దూరంలో ఉంది. కాంగ్రెస్‌కు 26 మంది సభ్యులు ఉండగా మిత్రపక్షాల బలం 58. అంటే ఇండియా కూటమి మొత్తం బలం 84. ఇక వైసిపికి చెందిన 11 మంది, బిజెడికి చెందిన 8 మంది ఏ కూటమికీ చెందరు. తొమ్మిది రాష్ట్రాల నుండి 12 స్థానాలకు వచ్చే నెల 3వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. జమ్మూకాశ్మీర్ నుండి నలుగురు ఎగువసభకు ఎన్నిక కావాల్సి ఉంది. అక్కడ శాసనసభ లేకపోవడంతో ఎన్నికలు జరగవు. దీంతో రాజ్యసభ సభ్యుల సంఖ్య 241కి తగ్గుతుంది. రాజ్యసభలో మొత్తం 245 స్థానాలు ఉన్నాయి. కేంద్ర మంత్రులు పీయుష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా సహా పలువురు రాజ్యసభ సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఎగువసభలో వారి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మొత్తంమీద ఎగువసభలో 10 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ, ఒడిషా రాష్ట్రాల నుండి రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. బిఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరి, తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఒడిషాలో బిజెడి ఎంపీ మమతా మొహంతా తన రాజ్యసభ స్థానానికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. దీంతో ఆ స్థానం కూడా ఖాళీ అయింది. గోయల్, సోనోవాల్, సింధియాతో పాటు రాజ్యసభ సభ్యులైన కామాఖ్య ప్రసాద్ తాసా (బిజెపి), మిషా భారతి (ఆర్‌జెడి), వివేక్ ఠాకూర్ (బిజెపి), దీపేందర్ సింగ్ హుడా (కాంగ్రెస్), ఉదయన్‌రాజె భోస్లే (బిజెపి), కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), విప్లవ్ కుమార్ దేవ్ (బిజెపి) లోక్‌సభకు ఎన్నికవడంతో ఆ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

వెండితెరపై జాతీయోద్యమ స్ఫూర్తి




భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వెల్లివిరిసిన ఐక్యతని, సామరస్యాన్ని, ప్రజాబలాన్ని కళ్లకు కట్టి చూపించడంలో సినిమాలు కీలకపాత్ర పోషించాయి. స్వాతంత్ర్య ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్న దశలోనే భారతీయ సినిమా మాటలు నేర్చింది. ఈ క్రమంలో అప్పటి భారతీయ సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢాచారాల నుంచి ప్రజలను చైతన్యపరుస్తూ స్వాతంత్ర్య పోరాటం దిశగా వారిని కార్యోన్ముఖులను చేసేలా చిత్రాలు వచ్చాయి. అంటరానితనం వద్దన్న మహాత్ముని ఆశయ స్ఫూర్తితో 'మాలపిల్ల' వంటి చిత్రాలు తీశారు. కలికి కృష్ణమూర్తి నవల ఆధారంగా తమిళంలో తీసిన 'త్యాగభూమి (1939)' సినిమా ఈ కోవకు చెందిందే. ఈ సినిమా విడుదల కాగానే బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ చిత్రకథ ప్రముఖ తమిళ వీక్లీ 'ఆనంద వికటన్'లో సీరియల్‌గా వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమం ఆధారంగా వివిధ భాషల్లో పలు చిత్రాలొచ్చాయి. 1996లో మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారిగా ప్రియదర్శన్ దర్శకత్వంలో వచ్చిన 'కాలాపానీ' నాటి ఉద్యమ ఖైదీల కష్టాలను కళ్లకు కట్టినట్లుగా చూపింది. మలయాళంలో దర్శకుడు ఐ.వి.శశి 1988లో మమ్ముట్టి, సురేష్ గోపీ వంటి తారాగణంతో తీసిన భారీ చిత్రం '1921'. బ్రిటీష్ పాలకులపై కేరళలలో 1920ల్లో తలెత్తిన మలబారు తిరుగుబాటును పట్టిచూపింది. 1824 ప్రాంతంలోనే ఈస్టిండియా కంపెనీపై ముమ్మారు దండెత్తి వీరమరణం పొందిన ధీరవనిత కిత్తూరు రాణి చెన్నమ్మ. ఆమె జీవితకథ ఆధారంగా బి.ఆర్.పంతులు 1961లో తీసిన కన్నడ చిత్రం 'కిత్తూరు చెన్నమ్మ'లో బి.ఆర్.సరోజాదేవి ఆ పాత్ర పోషించారు. మహాత్ముడి జీవితకథ ఆధారంగా 1982లో రిచర్డ్ ఆటెన్‌బరో తీసిన 'గాంధీ' చిత్రం విశ్వవేదికపై 11 నామినేషన్లు పొంది, ఏకంగా 8 ఆస్కార్ అవార్డులను గెల్చుకుంది. హిందీలో జాతీయోద్యమ కథలతో 'ప్రేమ్ కహానీ (1975), క్రాంతి (1981) వంటి చిత్రాలొచ్చాయి. మళ్లీ 20 ఏళ్ల తర్వాత అమీర్‌ఖాన్ 'లగాన్', మంగళ్‌పాండే, రంగ్ దే బసంతి వంటి చిత్రాలతో మంచి ఊపు తీసుకొచ్చారు. విప్లవయోధుడు 'భగత్‌సింగ్' జీవిత చరిత్రపై పూర్తి నిడివితో హిందీలో ఏకంగా ఏడు చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఇదంతా ఒక ఒరవడి కాగా, 2014 నుంచి చరిత్రను వక్రీకరించే భావజాలంతో సినిమాలు రావడం మొదలైంది. ఒక మతం వారిని ద్రోహులుగా చూపటం ఈ సినిమాల మెయిన్ అజెండాగా మారింది. ప్రజల మధ్య కులానికి, మతానికి అతీతమైన ఐక్యత, సామరస్యం, అభ్యుదయం వెల్లివిరిసిన వాస్తవ దృశ్యం సినిమాలుగా రావాల్సి ఉంది.

స్వరాజ్య కాంక్ష కోసం...

'బొబ్బిలిపులి (1982)లో వచ్చిన ఈ సినిమాలో ఎన్టీఆర్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో మెప్పించారు. అదే ఏడాది వచ్చిన 'నా దేశం'లోనూ దేశభక్తిని ప్రదర్శించారు. 'మేజర్ చంద్రకాంత్ (1993)'లో 'జన్మభూమి నా దేశం' అంటూ సాగే పాటలో స్వాతంత్ర్య ఉద్యమ నేతల పాత్రల్లో మెప్పించారు. స్వరాజ్య కాంక్ష కోసం ఆంగ్ల దొరలపై నిప్పులు చెరిగిన తెలుగువీరుడు 'అల్లూరి సీతారామరాజు'. టైటిల్‌రోల్ పోషిస్తూ సూపర్‌స్టార్ కృష్ణ నటించిన ఈ చిత్రం ప్రభంజనమే సృష్టించింది. చిరంజీవి హీరోగా తెరకెక్కిన చిత్రం 'సైరా' (ఉయ్యాలవాడ నరసింహారెడ్డి). స్వాతంత్ర్యం కోసం జరిగిన తొలి యుద్ధంలో వీరోచితంగా పోరాడిన ధీరుడు ఆయన. ఆ తిరుగుబాటునే కథాంశంగా 'సైరా' తెరకెక్కింది. 'రేనాడు వీరులారా...చరిత్రలో మనం ఉండకపోవచ్చు..చరిత్ర ఈ రోజు మనతోనే మొదలవ్వాలి' అంటూ చిరంజీవి వెండితెరపై సైరాగా చేసిన గర్జన బాక్సాఫీస్ వద్ద విజయపథాన ముందుకు సాగింది. బ్రిటీష్ దొరల తుపాకీ తూటాలకు రొమ్ము విరిచి 'ఇక్కడ కాల్చు' అంటూ గుండెలను చూపించిన వీరుడు టంగుటూరి ప్రకాశంపంతులు. ఆయన జీవితం ఆధారంగా 'ఆంధ్రకేసరి' సినిమా తెరకెక్కింది. విజయ్‌చందర్ టైటిల్ పాత్రను పోషిస్తూ సినిమాకు దర్శకత్వం వహించారు. టాలీవుడ్ అగ్రదర్శకుడు రాజమౌళి తీసిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోనూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చూపించారు. ఆంగ్లేయుల తూటాలకు ఎదురెళ్లిన అల్లూరితో, నిజాంపై పోరు జరిపిన గోండు వీరుడు కొమరం భీం స్నేహం చేస్తే ఎలా ఉంటుందనే కథాంశంతో తెరకెక్కించారు. కొమరం భీమ్‌గా ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజుగా రామ్‌చరణ్ నటించారు. అయితే, ఈ పాత్రల చిత్రీకరణ వాస్తవ విరుద్ధంగా ఉందనే విమర్శలూ వచ్చాయి. 'నేటి భారతం (1983)'లో సుమన్, విజయ్‌శాంతి నటించిన సినిమా దేశభక్తిపూరితంగా సాగింది. పరమవీరచక్ర (2011) బాలకృష్ణ హీరోగా వచ్చిన ఈ సినిమా దేశభక్తిని ప్రబోధించింది.



ఈఫిల్ టవర్ వద్ద పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలు

భారత్‌కు ఆరు పతకాలు

టాప్‌లో అమెరికా, 2వ స్థానంలో చైనా, క్యూబాకు 32వ స్థానం

పారిస్: 33వ విశ్వక్రీడల్లో 209 దేశాలు ప్రాతినిధ్యం వహించగా.. 84 దేశాలు మాత్రమే పతకాల పట్టికలో చోటు దక్కించుకున్నాయి. 117మంది అథ్లెట్లతో పారిస్‌లో అడుగిడిన భారత్.. కేవలం 6పతకాలతో 71స్థానంలో నిలిచింది. నీరజ్ చోప్రా జావెలిన్ త్రో విభాగంలో రజత పతకం సాధించగా.. సాధించాడు. 10మీ. ఎయిర్ రైఫిల్ మహిళల విభాగంలో మను భాకర్, 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ విభాగంలో మను, సరభ్‌జ్యోతి సింగ్ జోడీతోపాటు 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో స్వప్నిల్ కుశాలే, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, పురుషుల హాకీజట్టు కాంస్య పతకాలను సాధించింది. ఈసారి షూటింగ్‌లో భారత్‌కు మూడు కాంస్య పతకాలు దక్కగా.. అథ్లెటిక్స్, రెజ్లింగ్, హాకీ విభాగాల్లో పతకాలు దక్కాయి. అమెరికా చివరి క్రీడాంశమైన మహిళల బాస్కెట్‌బాల్ ఫైనల్లో స్వర్ణ పతకం సాధించి పతకాల పట్టికలో మరోసారి అగ్రస్థానానికి ఎగబాకింది. అమెరికా 40స్వర్ణ, 44రజత, 42కాంస్యాలతో సహా మొత్తం 126 పతకాలతో అగ్రస్థానంలో నిలువగా.. చైనా 40స్వర్ణ, 27రజత, 24కాంస్యాలతో 91 పతకాలతో రెండోస్థానంలో నిలిచింది. ఆతిథ్య ఫ్రాన్స్ 16స్వర్ణ, 26రజత, 22కాంస్యాలతో 64 పతకాలతో 5వ స్థానంలో ఉండగా.. 3వ స్థానంలో జపాన్(45), 4వ స్థానంలో ఆస్ట్రేలియా(53) ఉన్నాయి. క్యూబా 2స్వర్ణ, 1రజత, 6కాంస్యాలతో సహా 9పతకాలతో 32వ స్థానంలో నిలువగా.. ఉక్రెయిన్(22), పాకిస్తాన్ ఒక స్వర్ణంతో(62వ), ఉ.కొరియా 2రజత, 4కాంస్యాలతో(68)వ స్థానాల్లో నిలిచాయి.



పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. అమెరికా	40	44	42	126
2. చైనా	40	27	24	91
3. జపాన్	20	12	13	45
4. ఆస్ట్రేలియా	18	19	16	53
5. ఫ్రాన్స్	16	26	22	64
6. నెదర్లాండ్స్	15	7	12	34
7. బ్రిటన్	14	22	29	65
8. ద.కొరియా	13	9	10	32
9. ఇటలీ	12	13	15	40
10. జర్మనీ	12	13	8	33
11. న్యూజిలాండ్	10	7	3	20
12. కెనడా	9	7	11	27
13. ఉజ్బెకిస్తాన్	8	2	3	13
14. హంగరీ	6	7	6	19
15. స్పెయిన్	5	4	9	18
16. స్వీడన్	4	4	3	11
17. కెన్యా	4	2	5	11
18. నార్వే	4	1	3	8
19. ఐర్లాండ్	4	0	3	7
20. బ్రెజిల్	3	7	10	20
21. ఇరాన్	3	6	3	12
22. ఉక్రెయిన్	3	5	4	12
23. రొమేనియా	3	4	2	9
24. జార్జియా	3	3	1	7
25. బెల్జియం	3	1	6	10
26. బల్గేరియా	3	1	3	7
27. సెర్బియా	3	1	1	5
28. ఛెచియా	3	0	2	5
29. డెన్మార్క్	2	2	5	9
30. అజర్‌బైజాన్	2	2	3	7
31. క్రొయేషియా	2	2	3	7
32. క్యూబా	2	1	6	9
33. బహ్రెయిన్	2	1	1	4
34. స్లొవేనియా	2	1	0	3
35. చైనీస్ తైపీ	2	0	5	7
36. ఆస్ట్రియా	2	0	3	5
37. హాంకాంగ్(చైనా)	2	0	2	4
38. ఫిలిప్పీన్స్	2	0	2	4
39. అల్జీరియా	2	0	1	3
40. ఇండోనేషియా	2	0	1	3
71. ఇండియా	0	1	4	5

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

అమన్‌కు సాధ్యమైంది.. వినేశ్‌కు సాధ్యం కాలేదు...

- రాత్రికి రాత్రి 4.5కిలోలు తగ్గిన అమన్ సెహ్రావత్
- వినేశ్ 2.7కిలోలు బరువు తగ్గింపులో అధికారులు విఫలం
- కావాలనే చేశారా..? రాజకీయ కోణం దాగి ఉందా..?





33వ ఒలింపిక్స్ రెజ్లింగ్(కుస్తీ) విభాగంలో భారత్‌కు ఈసారి ఒకే ఒక్క పతకం లభించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రెండు పతకాలు దక్కితే.. ఈసారి ఒక పతకం ముద్దాడగా రెండో పతకం తృటిలో చేజారింది. వినేశ్ ఫోగాట్‌కు దక్కాల్సిన ఆ పతకాన్ని లాగేసుకోవడం రాజకీయ దుమారాన్ని రేపింది. ఎందుకంటే పురుషుల కేటగిరీలో అమన్ సెహ్రావత్ పోటీపడిన 57కిలోల విభాగంలో అతడు రాత్రికి రాత్రి 4.5కిలోలు బరువు తగ్గింపు సాధ్యమైతే.. వినేశ్ ఫోగాట్ పెరిగిన 2.9కిలోల బరువును ఎందుకు తగ్గించలేక పోయారనేది ఆ అధికారులకే ఎరుక.

వినేశ్‌పై కావాలనే విషప్రచారం...

వినేష్ ఫోగాట్, ఆగస్టు 7న జరిగిన 50 కిలోల కేటగిరీ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరి స్వర్ణ పతక రేసులో నిలిచిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా రికార్డుల్లోకెక్కింది. ఫైనల్‌కు చేరి పతకం ఖాయం చేయడంతో కోట్లాది మంది భారతీయులు సంబరాలకు సిద్ధమయ్యారు. ఆ మరుసటిరోజు ఉదయం నాటికి 29ఏళ్ల వినేశ్‌పై అనర్హత వేటు పడడంతో దేశంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముందు వచ్చిన ఈ వార్త ఆమెపై అందరిలోనూ దురభిప్రాయాన్ని వ్యక్తం చేసేలా మారిపోయింది. తొలిరోజు 49కిలోల 900గ్రాములతో మూడు బౌట్‌లలో పాల్గొన్న వినేశ్.. ఆ మరుసటి రోజు బుధవారం(ఆగస్టు 7) ఉదయం నాటికి 50 కిలోల 100 గ్రాములు బరువు ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెపై గేమ్ నిబంధనల ప్రకారం అనర్హత వేటు పడింది. అలాగే ఆమెకు ఖాయమైన పతకం కోల్పోవాల్సి వచ్చింది. నిర్వాహకులు మాత్రం సెమీఫైనల్స్‌లో ఫోగాట్ చేతిలో ఓడిన క్యూబా రెజ్లర్ యుస్నీలీస్ గుజ్‌మాన్‌ను అమెరికాకు చెందిన సారా హిల్‌డెబ్రాంట్ మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించి పతకాలను అందజేసేశారు.

రాజకీయ కోణం దాగి వుందా..?

50కిలోల కేటగిరీలో ఫైనల్‌కు చేరిన ఫోగాట్‌పై ఏదైనా కుట్ర జరిగిందా..? అనే కోణంలోనూ చూడాల్సి ఉంది. ఆమెతో పాటు వచ్చిన భారత అధికారులు ఈ విధ్వంసానికి ఏమైనా పాల్పడ్డారా..? అనేది ఊహించాల్సి ఉంది. సెమీఫైనల్ విజయం తర్వాత ఫోగాట్ ఎలా అధిక బరువు పెరిగింది? అనే కోణంలోనూ చూడాల్సి ఉంది. సెమీస్ మ్యాచ్ పూర్తయ్యాక ఆమె 52.7 కేజీలకు బరువు పెరిగిందని అధికారులు వివరణ ఇచ్చారు.. ఆమెను ఆ రాత్రికి రాత్రి 2.7 కేజీల బరువును తగ్గించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అలాగే ఒలంపిక్స్ అధికారులను ఫోగాట్ విషయంపై న్యాయబద్ధంగా పోరాడడంలోనూ పూర్తిగా విఫలమయ్యారు. దీనిలో రాజకీయ కోణం ఏదైనా దాగి ఉందా అనేది మరో అంశం. తొలుత వినేశ్‌పై ఒలింపిక్స్ ముగిసేలోపు తీర్పు వెలువరిస్తామని ప్రకటించిన 'కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్' ఆ తర్వాత మాట 13న వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో ఆమెకు దక్కాల్సిన పతకం ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరోవైపు సాధించిన విజయానికి భారత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యులు ఆ రోజు కార్యకలాపాలను బహిష్కరించి వినేశ్‌కు గట్టిగా మద్దతు పలికారు.

10 గంటల్లో 4.5 కిలోలు తగ్గిన అమన్

2.7కిలోల అధిక బరువును తగ్గించలేకపోయిన భారత రెజ్లింగ్ అధికారులు.. కాంస్య పతకం సాధించిన అమన్ సెహ్రావత్ 4.5కిలోల అధిక బరువును తగ్గించగలిగారు. ఒలింపిక్స్ రెజ్లింగ్ సెమీస్‌లో గురువారం(8న) రాత్రి అమన్ సెహ్రావత్ ఓడిపోయాడు. 57కిలోల విభాగం బరిలో దిగిన అమన్.. సెమీస్ మ్యాచ్ పూర్తయ్యాక అతని బరువు చూస్తేనేమో 61.5 కిలోలు ఉంది. అతను పోటీపడే విభాగం ఏమో 57 కేజీలు. శుక్రవారం ఉదయం బరువు తనిఖీ చేసే సమయానికి ఇంకా 10 గంటలే ఉంది. అప్పటిలోపు 4.5కిలోలు తగ్గాలి. ఈసారి అధికారులు ఏం మాయ చేశారో గానీ కాంస్య పతక పోటీ సమయానికి అమన్ 56.9కిలోలకు చేరుకున్నాడు. అది ఎలా సాధ్యమైందో వారికే ఎరుక.



మీకోసం




కొబ్బరికాయను నాలుగు గంటలపాటు నీళ్లలో నానబెట్టి, ఆ తర్వాత పగలగొడితే కొబ్బరి సులభంగా వస్తుంది.

జీవన సౌరభం

వినేందుకు కటువుగా అనిపించినా మీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలు తీసుకోవడం మంచిది.

JEEVANA జీవన the family

వేప చెట్టు



సైన్స్ మాస్టర్ మనోజ్ చెట్ల ప్రాముఖ్యత గురించి క్లాసులో చెబుతున్నారు. 'చెట్లు మనకు జీవనాధారం, మనకు ప్రాణ వాయువు, చల్లటి నీడను ఇచ్చేది చెట్లే. మనం ఏ చెట్టునూ కొట్టకూడదు. వాటిని రక్షించుకోవాలి. ప్రతి చెట్టును కాపాడుకోవాలి. చెట్లపై మీకు ఏవైనా సందేహాలు ఉంటే అడగండి' అని పిల్లలతో అన్నారు.

విజయ్ అనే కుర్రాడు లేచి 'సార్ నాదో అనుమానం, వేప చెట్టు నుంచి పాలు కారడం, ప్రజలు పూజలు చేయడం, దేవతా వృక్షంగా కొలవడం ఇదంతా నిజమేనా! సార్' అని అడిగాడు. మనోజ్ సార్ చిన్నగా నవ్వి 'ప్రకృతిలో చెట్లు అన్ని సమానమే, ఏ వృక్షం దేవతా వృక్షం కాదు' అన్నారు మాస్టారు.

'మరి వేప చెట్లకు పాలు కారడం, ప్రజలు పూజలు చేయడం ఏమిటీ మాస్టారు' అన్నాడు మరో విద్యార్థి అజయ్.

'అదంతా మూఢ నమ్మకం. వేప చెట్టుకు పాలు కారడం అనేది మహత్తు కాదు; మామూలు విషయమే! ఏపుగా పెరిగే వేప చెట్లు కాండం మీద బెరడుకు పగుళ్లు వస్తాయి. ఆ నెరదల్లో ఎన్నో జీవులు నివాసం ఏర్పరుచుకుంటాయి. చెదపురుగులు, చీమలు, తెల్లపురుగులతో పాటు కొన్ని శిలీంద్రాలు కూడా ఉంటాయి. అలాంటి లక్షలాది పురుగులు, గుడ్లు, లార్వాలు ఉన్న చోట బెరడు మీద ఒత్తిడి ఏర్పడినా, వర్షం వచ్చినా అవన్నీ చచ్చిపోతాయి. వాటి కణాలు చిట్లిపోతాయి. చాలా కీటకాల రక్తం, కణస్రావం తెల్లగా ఉంటుంది. ఇవే ఆ చెట్టు నుంచి తెల్లగా కారుతాయి. దీన్ని పాలనుకోవడం, ఆ చెట్టుకి మహత్యం ఉందనుకోవడం అశాస్త్రీయం. మనమందరం ప్రజలను జాగృతం చేయాలి. అన్ని చెట్లు ఒకటేనని చాటాలి' అన్నారు మాస్టారు.

మాస్టారు చెప్పిన దానిలో నిజాలు గ్రహించారు విద్యార్థులు. ఆ రోజు నుంచి ప్రతి చెట్టును శ్రద్ధగా చూసుకున్నారు. చెట్లకు మహత్తులు ఏమీ ఉండవని పెద్దలకు చెప్పారు.

- కనుమ ఎల్లారెడ్డి,
తాడిపత్రి, 93915 23027.

M = 2
A = M + 1
T = 8
H = T - A
MATH = ?

లెక్క చేయండి


పిల్లలూ, ఇక్కడ అక్షరాలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి లైను జవాబు మీరు రాబట్టండి.

జవాబు : 240

నేను గీసిన బొమ్మ



ఘంటసాల యోగ నందిని,
5వ తరగతి,
ఎంపిపిఎస్ చటాకాయ,
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలం.. జ్వరాల భయం

వానలు విరివిగా కురిసే కాలం... వివిధ వ్యాధులు, జ్వరాలు ప్రబలే కాలం కూడా. చినుకు పడితే చిన్నపిల్లలకు తుమ్ములు వస్తుంటాయి. చలి గాలి వీచిందంటే వైరల్ ఫీవర్లు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ ఫీవర్ ఫియర్ చిన్నపిల్లల తల్లిదండ్రులకు ఈ సీజన్లో తప్పేది కాదు. ఈ సీజన్‌ను సేఫ్‌గా దాటాలంటే పేరెంట్స్ ఏమి చేయాలో తెలుసుకుందాం.





ప్రస్తుతం రాష్ట్రంలో తరచూ ముసురు వాతావరణం కొనసాగుతోంది. ఈ సీజన్లో కురిసే భారీ వర్షాలతో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని డ్రెయినేజీలు పొంగి పొర్లుతాయి. తాగునీరు కూడా కలుషితం అవుతుంది. కొంతమందికి వాతావరణం చల్లగా మారిన క్రమంలో దగ్గు మొదలవుతుంది. ఈ దగ్గు వారంరోజులైనా తగ్గకపోతే ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పిల్లలకు ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉంటుంది. వైరస్, బాక్టీరియా వ్యాప్తి చెందటానికి తడి వాతావరణం ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. చిన్న పిల్లలు ఉన్నవాళ్లు ఇంట్లో చల్లగాలి రాకుండా జాగ్రత్త పడాలి.

తుమ్ములతో పిల్లలకు ఇబ్బందులు

వర్షాకాలం దోమలు ఎక్కువగా ఉంటాయ్. ఈ సీజన్‌లో వాటి నుంచి తప్పించుకునేందుకు ఫ్యాన్ ఎక్కువ స్పీడ్ పెడితే పిల్లలు దగ్గు, జలుబుతో ఇబ్బంది పడతారు. అప్పుడు వాళ్లకు చల్లని వాతావరణం పడదని గుర్తించాలి. ఫ్యాన్‌ను తక్కువ స్పీడ్‌లోనే పెట్టాలి. పిల్లలకు పొడి దుస్తులు వేయాలి. వాతావరణం బాగా చల్లగా ఉన్న రోజుల్లో గది వాతావరణం వెచ్చగా ఉంచేందుకు ప్రయత్నించాలి. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాళ్లూ చేతులు శుభ్రం చేసుకోవటం అలవాటు చేయాలి. పెద్దవాళ్లు కూడా ఇది పాటించాలి. ఇలా చేస్తే తరచూ జలుబు, దగ్గుతో బాధపడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీపి పదార్థాలు (బిస్కెట్లు, చాక్లెట్లు, లడ్డూలు వంటివి) ఇవ్వొద్దు. ఇలా చేస్తే దగ్గు రాదు. దగ్గుతో బాధపడేవారు తొందరగా కోలుకుంటారు.

ద్రవాహారమే మేలు

దగ్గు తీవ్రంగా లేకపోయినా కొంతమంది పిల్లలు తినేటప్పుడు ఇబ్బంది పడుతుంటారు.. అలాంటివారు ఫుడ్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దగ్గుతో ఇబ్బందిపడే పిల్లలకు మింగటం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షాకాలం సీజన్‌లో తియ్యగా పుల్లగా ఉన్న ఆహారం ఇవ్వకూడదు. మింగడానికి వాళ్లు ఇబ్బంది పడుతున్నారని అనిపిస్తే సాఫ్ట్‌గా ఉన్న ఫుడ్ ఇవ్వాలి. ఎక్కువగా లిక్విడ్ ఫుడ్ ఇవ్వడానికి ప్రయత్నించాలి. ఇవి బాగానే తింటారు. పిల్లలకు సమస్య పోయేంత వరకూ పెద్దలకు, పిల్లలకు వేర్వేరుగా వంట చేయటం మేలు.

వేడినీటితో స్నానం బెటర్

కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకు జ్వరం వస్తే స్నానం చేయించారు. కానీ వేడి నీటితో స్నానం చేయించాలి. కానీ ఎక్కువ సేపు చేయించ కూడదు. స్నానం చేయిస్తేనే పిల్లలు కొంచెం యాక్టివ్‌గా ఉంటారు. మంచిగా నిద్రపోతారు. త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. జ్వరంతో బాధపడే పిల్లలకు రోజుకొకసారి స్నానం చేయించాలి. పిల్లలకు జ్వరం తగ్గిన కొద్ది రోజులకే వాళ్లకు ఇష్టమైన ఏదైనా ఆహారాన్ని ఇవ్వొచ్చు. సాధారణ జ్వరం ఉన్నప్పుడు నాన్‌వెజ్ ఇవ్వకుండా ఉండటమే బెటర్. సాధారణ జ్వరం ఉన్నప్పుడు నాన్ వెజ్ ఇవ్వకూడదు. తగ్గిన కొద్ది రోజులకు ఇవ్వొచ్చు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

వర్షాకాలంలో కల్తీ ఆహారం, తాగునీరు, మురుగు, దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటమే ఈ వ్యాధుల నియంత్రణకు మార్గం. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే.. రోగాలు దాడి చేస్తాయి. మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి సీజనల్ వ్యాధులు వేధిస్తాయి. ఈ సీజన్‌లో పిల్లల నుంచి పెద్దల వరకూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలి. సాధారణంగా వర్షంలో తడిస్తే చిన్నారులు రొంప, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. వెంటనే వైద్యులను సంప్రదిస్తే సులభంగా తగ్గించుకోవచ్చు.

వ్యాధుల వాహకాలుగా దోమలు

వర్షాలకు విజృంభిస్తున్న దోమలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాల్వల్లో పేరుకున్న మురుగు, నిల్వనీరు దోమలకు ఆవాసంగా మారతాయి. దోమల కారణంగా మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డెంగ్యూ ఉధృతి కొనసాగుతోంది. మలేరియా అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. కుట్టిన దోమలో ప్లాస్మోడియం పరాన్న జీవి ఉంటే మలేరియా వస్తుంది. సకాలంలో చికిత్స తీసుకోకపోతే.. సెరిబ్రల్ మలేరియాకు దారి తీయొచ్చు. ఇది ప్రాణాంతక పరిస్థితి. మూర్ఛలు, మూత్రపిండాల వైఫల్యం, కామెర్లు, శ్వాసకోశ రుగ్మతలకు దారి తీస్తుంది. అధిక తేమ, ఉష్ణోగ్రత మార్పులు ఇన్‌ఫ్లుయెంజా వ్యాప్తికి అనువుగా ఉంటుంది. ఇన్‌ఫ్లుయెంజా ఈ వైరస్ సోకినప్పుడు జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తుమ్ములు, తలనొప్పి, ముక్కు కారడం, అలసట, విరేచనాలు, ఊపిరి సరిగా ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో చికిత్స తీసుకోకపోతే.. న్యుమోనియా, ఉబ్బసం, డయాబెటిస్, గుండె సమస్యలు వంటి దీర్ఘకాలిక పరిస్థితులకు దారితీస్తుంది. కాబట్టి దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి.

మనం తాగే నీటి ద్వారానే 40 శాతం వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగితే చాలా వరకూ వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తున్నారా?

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూడదు
- దోమలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి
- నిండుగా దుస్తులు ధరించాలి
- స్వచ్ఛమైన, ఫిల్టర్ చేసిన, కాచి చల్లార్చిన నీరే తాగాలి.
- రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.
- తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవాలి.
- జనసాంద్రత ఉన్న ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్క్ కచ్చితంగా వాడాలి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68